

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 14-12-2025 | సంపుటి - 26 | సంచిక -207 | రూ : 4 | పేజీలు: 8




2లో

## హైదరాబాద్ వచ్చి తెలుగువారిని
# కలవడం సంతోషంగా ఉంది: మెస్సీ

- తెలుగు ప్రజలు చూపిన అభిమానం తనకు శక్తినిచ్చిందన్న మెస్సీ
- ఉప్పల్ స్టేడియంలో రేవంత్ రెడ్డి, మెస్సీ ఫ్రెండ్లీ మ్యాచ్
- అపర్ణ మెస్సీ టీమ్‌పై సింగరేణి ఆర్ఆర్ జట్టు విజయం

## 'ఏఐ'తో ఉద్యోగాలు పోతాయనే ఆందోళన...
### స్పందించిన ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్

2లో



## వందే భారత్ రైళ్లలో
# ఇక స్థానిక రుచులు
### రైల్వే శాఖ కీలక నిర్ణయం

- వందే భారత్ రైళ్లలో స్థానిక వంటకాలు అందిస్తామన్న అశ్విని వైష్ణవ్
- భవిష్యత్తులో అన్ని రైళ్లకు ఈ విధానాన్ని విస్తరించనున్నట్లు వెల్లడి
- టికెట్ బుకింగ్‌లో మోసాలకు అడ్డుకట్ట.. 3.03 కోట్ల నకిలీ ఐడీలు రద్దు
- తత్కాల్ టికెట్ల కోసం ఆధార్ ఓటీపీ విధానంతో పెరిగిన లభ్యత
- నిజమైన ప్రయాణికులకు సులువుగా టికెట్లు అందేలా చర్యలు


2లో


2లో

## రాష్ట్ర, దేశ రాజకీయాల్లో
# ఎన్టీఆర్ ముద్ర శాశ్వతం

- ఎన్టీఆర్ చారిత్రక పోరాటానికి స్వర రూపం.. ఘనంగా ఆడియో బుక్ విడుదల
- హాజరైన ఎన్టీఆర్ కుమార్తె పురందేశ్వరి
- ఎన్టీఆర్ ముద్ర శాశ్వతమైనది, విశిష్టమైనదని వెల్లడి
- సూర్యచంద్రులు ఉన్నంతకాలం ఎన్టీఆర్ పేరు నిలిచిపోతుందని ఉద్ఘాటన

## నారా బ్రహ్మణికి మోస్ట్ పవర్‌ఫుల్
# ఉమెన్ ఇన్ బిజినెస్' అవార్డు


2లో

- బిజినెస్ టుడే 'మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్' అవార్డు అందుకున్న నారా బ్రహ్మణి
- ముంబైలో జరిగిన కార్యక్రమంలో ఈ పురస్కారం స్వీకరణ
- శాశ్వత సంస్థల నిర్మాణమే నిజమైన నాయకత్వమని వెల్లడి
- భారత్‌లో మహిళా నేతలను ప్రోత్సహించడంపై బిజినెస్ టుడేకు ప్రశంస
- హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా బ్రహ్మణి బాధ్యతలు


2లో

## ఢిల్లీలో 'తీవ్ర'స్థాయికి
# వాయు కాలుష్యం...

- కాలుష్య కోరల్లో దేశ రాజధాని
- 400 దాటిన వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ)
- 'గ్రాప్' మూడో దశ ఆంక్షలను అమలు చేసిన ప్రభుత్వం
- ఇతర రాష్ట్రాల బీఎస్-4 డీజిల్ వాహనాలపై నిషేధం

# రాష్ట్ర, దేశ రాజకీయాల్లో ఎన్టీఆర్ ముద్ర శాశ్వతం: పురందేశ్వరి

రాష్ట్ర, దేశ రాజకీయాల్లో నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) ముద్ర శాశ్వతమైనదని, సూర్యచంద్రులు ఉన్నంత వరకు ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ఎన్టీఆర్ జీవితంలోని చారిత్రక ఘట్టమైన '1984 ఆగస్టు ప్రజాస్వామ్య పరిరక్షణోద్యమం'పై విక్రమ్ పూల రచించిన 'సజీవ చరిత్ర' పుస్తకం ఆడియో వెర్షన్ ను ఆమె ఆవిష్కరించారు. జయప్రద ఫౌండేషన్, టీడీ జనార్ధన్ నేతృత్వంలోని ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ సంయుక్తంగా శనివారం హైదరాబాద్‌లోని ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్‌లో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న పురందేశ్వరి మాట్లాడుతూ, 1984 నాటి పరిరక్షణోద్యమం కేవలం ఎన్టీఆర్ జీవితంలోనే కాక, దేశ రాజకీయాల్లోనూ ఒక కీలక మలుపు అని అభివర్ణించారు. ఆనాడు పార్టీ ఫిరాయింపులు, ప్రభుత్వాలను కూల్చే అనైతిక చర్యలు



సర్వసాధారణంగా ఉండేవని, కానీ ఎన్టీఆర్ చేసిన పోరాటం వల్లే దేశంలో పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం (1985 నాటి 52వ రాజ్యాంగ సవరణ) అమల్లోకి వచ్చిందని గుర్తుచేశారు. పార్లమెంట్‌లో ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటులో, ఆయన పేరిట నాణెం విడుదల చేయించడంలో తన వంతు కృషి చేసి, తండ్రి రుణం కొంతమేర తీర్చుకోగలిగానని ఆమె పేర్కొన్నారు. ఎన్టీఆర్ భావజాలాన్ని వ్యాపింపజేస్తున్న లిటరేచర్ కమిటీ సభ్యులను, చైర్మన్ టీడీ జనార్ధన్‌ను ఆమె అభినందించారు.

కమిటీ చైర్మన్ టీడీ జనార్ధన్ స్వాగతోపన్యాసం చేస్తూ, తెలుగునాట రాజకీయాలను 'ఎన్టీఆర్‌కు ముందు, ఎన్టీఆర్ తర్వాత' అని చూడాల్సి ఉంటుందని అన్నారు. ఎందరో ముఖ్యమంత్రులు పాలించినా, ప్రజల గుండెల్లో నిలిచిపోయింది ఒక్క ఎన్టీఆర్ మాత్రమేనని చెప్పారు. ఎన్టీఆర్ సిద్ధాంతాలను భావి తరాలకు అందించే లక్ష్యంతో కమిటీని ఏర్పాటు చేశామని, ఇప్పటికే పలు పుస్తకాలు ప్రచురించామని, 'అన్న ఎన్టీఆర్' యూట్యూబ్ ఛానల్ ప్రారంభించామని తెలిపారు. ఎన్టీఆర్ పేరును అజరామరం చేయడమే తమ ధ్యేయమని స్పష్టం చేశారు. సీనియర్ నేత, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు మాట్లాడుతూ, ఎన్టీఆర్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. అతి సామాన్యుడైన తనను ఆరుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా చేసిన ఘనత ఎన్టీఆర్‌దేనని అన్నారు. పేదవాడి ఆకలి తెలిసిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని, ఆయన తన గుండెల్లో ఎప్పటికీ నిలిచి ఉంటారని తెలిపారు. ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ మాట్లాడుతూ, 1984 నాటి క్లిష్ట పరిస్థితులను వివరించారు. ఒకవైపు తల్లి క్యాన్సర్‌తో బాధపడుతుంటే, మరోవైపు తండ్రి అమెరికాలో గుండె ఆపరేషన్ చేయించుకుని తిరిగి వచ్చిన వెంటనే పదవి నుంచి దించారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యులు విశ్రాంతి సూచించినా లెక్కచేయకుండా, ప్రజాస్వామ్యం కోసం ఆయన పోరాడిన తీరును స్మరించుకున్నారు. కార్యక్రమం ప్రారంభంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, 'మా తెలుగు తల్లికి' గీతాన్ని ఆలపించారు. రచయిత విక్రమ్ పూల పుస్తక విశేషాలను సభకు పరిచయం చేశారు. ఈ ఆడియో పుస్తకానికి గాత్రధారణ చేసిన గాయత్రిని పురందేశ్వరి, టీడీ జనార్ధన్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో సినీ నిర్మాత కేవీఎస్ రామారావు, నందమూరి రామకృష్ణ, పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు, ఎన్టీఆర్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 'ఏఐ'తో ఉద్యోగాలు పోతాయనే ఆందోళన..

కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏఐ) కారణంగా ఉద్యోగాలు పోతాయనే ఆందోళనలపై ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ స్పందించారు. ఏఐతో కొన్ని ఉద్యోగాలకు ముప్పు లేదని, అయితే అలాంటి ఉద్యోగాల్లో ఖాళీలను భర్తీ చేయలేకపోతున్నామని ఆయన అన్నారు. ఈ మేరకు ఆయన ఒక పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ, సరైన శిక్షణ లేని శ్రామిక శక్తితో ఏఐ ఆధారిత భవిష్యత్తు వైపు భారత్ అడుగులు వేస్తోందని అన్నారు. కొన్ని ఉద్యోగాలు ఏఐతో భర్తీ కావని, వాటిని మనుషులే చేయాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఉదాహరణకు ప్రస్తుత ఏఐ యుగంలో ప్లంబర్ ఉద్యోగం వెంటనే పోకపోవచ్చని అన్నారు. ఏఐ ప్రభావం లేని ప్లంబింగ్, ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్ మరమ్మతు వంటి ఆటోమేషన్ కారణంగా ప్రభావితం కాని కొన్ని ఉద్యోగాల గురించి ఆయన ప్రస్తావించారు. వీటికి కావలసిన నైపుణ్యాలు ప్రస్తుత విద్యావ్యవస్థ ద్వారా అందడం లేదని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాల్సి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఫ్రెంచ్, ఇంగ్లిష్ సాహిత్యంలో డిగ్రీ కంటే ఆధునిక ప్లంబింగ్ కోర్సును తాను సంతోషంగా చేస్తానని రఘురాం రాజన్ అన్నారు. ప్లంబర్‌కు అన్ని రకాలుగా వ్యాపార మెలకువలు తెలిసి ఉండాలని అన్నారు. అందుకు అనుగుణంగా సంస్కరణలు అవసరమని ఆయన వ్యాఖ్యానించారు. పిల్లలకు శారీరక, మానసిక ఎదుగుదలకు, భవిష్యత్తులో పోటీ ప్రపంచంలో రాణించేందుకు పోషకాహారం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు.

## నారా బ్రహ్మాణికి 'మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్ ఇన్ బిజినెస్' అవార్డు

ఏపీ మంత్రి నారా లోకేశ్ అర్ధాంగి, హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రహ్మణి ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకున్నారు. ప్రముఖ వాణిజ్య మ్యాగజైన్ 'బిజినెస్ టుడే' ఏటా అందించే 'మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్ ఇన్ బిజినెస్' అవార్డుకు ఆమె ఎంపికయ్యారు. ముంబైలో నిన్న సాయంత్రం జరిగిన కార్యక్రమంలో బ్రహ్మణి ఈ అవార్డును స్వీకరించారు. ఈ విషయాన్ని ఆమె స్వయంగా వెల్లడిస్తూ, ఈ గుర్తింపు దక్కడం పట్ల గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నాయకత్వంపై తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. "నాయకత్వం అంటే... శాశ్వతంగా నిలిచే సంస్థలను నిర్మించడం, బాధ్యతాయుతంగా విలువను సృష్టించడం, ఈ క్రమంలో ప్రజలను శక్తివంతం చేయడమే" అని ఆమె పేర్కొన్నారు. ఈ అవార్డుకు ఎంపిక చేసినందుకు 'బిజినెస్ టుడే'కు ఆమె ధన్యవాదాలు తెలిపారు. భారతదేశవ్యాప్తంగా మహిళా




నేతలను ప్రోత్సహించడం అభినందనీయమని కొనియాడారు. ఎన్ఎస్ఈ ఇండియాలో తన అభిప్రాయాలను పంచుకోవడం ద్వారా ఎన్నో విషయాలు నేర్చుకునే అవకాశం లభించడం ఆనందంగా ఉందని చెప్పారు. నారా బ్రహ్మణి ప్రస్తుతం హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. దీంతో పాటు, తన తండ్రి నందమూరి బాలకృష్ణ చైర్మన్‌గా ఉన్న బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి ట్రస్టులో బోర్డు మెంబర్‌గా కూడా సేవలందిస్తున్నారు.

## వందే భారత్ రైళ్లలో ఇక స్థానిక రుచులు..

వందే భారత్ రైళ్లలో ఇకపై ప్రయాణికులకు స్థానిక వంటకాలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. శనివారం రైల్ భవన్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ఈ కీలక నిర్ణయాన్ని వెల్లడించారు. రైళ్లు ప్రయాణించే ప్రాంతాల సంస్కృతి, రుచులను ప్రతిబింబించేలా ఆహారాన్ని అందించడం ద్వారా ప్రయాణికుల అనుభూతిని మెరుగుపరచవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. తొలుత వందే భారత్ రైళ్లలో ఈ విధానాన్ని ప్రవేశపెట్టి, భవిష్యత్తులో దశలవారీగా అన్ని రైళ్లకు విస్తరిస్తామని స్పష్టం చేశారు. మరోవైపు, నకిలీ గుర్తింపు కార్డులతో రైలు టికెట్లు బుక్ చేసే వారిపై ఉక్కుపాదం మోపినట్లు మంత్రి తెలిపారు. ఫేక్ ఐడీలను గుర్తించేందుకు పటిష్టమైన వ్యవస్థను ప్రవేశపెట్టిన తర్వాత సానుకూల ఫలితాలు వస్తున్నాయని చెప్పారు. ఈ సంస్కరణల ఫలితంగా ఇప్పటివరకు 3.03 కోట్ల నకిలీ ఖాతాలను శాశ్వతంగా రద్దు చేశామని, మరో 2.7 కోట్ల ఐడీలను అనుమానాస్పద కార్యకలాపాల కారణంగా తాత్కాలికంగా నిలిపివేశామని వివరించారు. గతంలో ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌లో రోజుకు లక్ష వరకు కొత్త యూజర్ ఐడీలు నమోదయ్యేవి, కానీ ఇప్పుడు ఆ సంఖ్య 5,000కు పడిపోయిందని తెలిపారు. సాధారణ ప్రయాణికులు సులువుగా టికెట్లు బుక్ చేసుకునేలా టికెటింగ్ వ్యవస్థను సంస్కరించాలని అధికారులను మంత్రి అశ్విని వైష్ణవ్ ఆదేశించారు. ఇప్పటికే తత్కాల్ టికెట్ల బుకింగ్‌లో పారదర్శకత కోసం ఆధార్ ఆధారిత ఓటీపీ విధానాన్ని ప్రవేశపెట్టామని, దీనివల్ల కన్ఫర్మ్ టికెట్ల లభ్యత సమయం గణనీయంగా పెరిగిందని ఆయన పేర్కొన్నారు.

## ఢిల్లీలో 'తీవ్ర'స్థాయికి వాయు కాలుష్యం... 'గ్రాప్3' నిబంధనలు అమలు

దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం మరోసారి ప్రమాదకర స్థాయికి చేరింది. గాలి నాణ్యత 'తీవ్ర' కేటగిరీకి పడిపోవడంతో, వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ (CAQM) శనివారం కీలక నిర్ణయం తీసుకుంది. ఢిల్లీఎన్‌సీఆర్ వ్యాప్తంగా గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (గ్రాప్) కింద మూడో దశ ఆంక్షలను తక్షణమే అమలులోకి తెస్తున్నట్లు ప్రకటించింది. శుక్రవారం ఉదయం ఢిల్లీ వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ) 400 మార్కును దాటడమే ఈ నిర్ణయానికి కారణం. గత మూడు రోజులుగా ఏక్యూఐ క్రమంగా పెరుగుతూ వచ్చింది. డిసెంబర్ 10న 259గా ఉన్న సూచీ, 12వ తేదీ నాటికి 349కి చేరి, చివరకు 'తీవ్ర' స్థాయిని దాటింది. చాలా తక్కువ వేగంతో వీస్తున్న గాలులు, స్థిరమైన వాతావరణం కారణంగా కాలుష్య కారకాలు గాలిలోంచి బయటకు వెళ్లకుండా ఢిల్లీఎన్‌సీఆర్ పరిధిలోనే పేరుకుపోయాయని CAQM వివరించింది. ముఖ్యంగా శీతాకాలంలో అధికంగా ఉండే పీఎం 2.5 కణాలు ప్రమాదకర స్థాయిలో ఉన్నట్లు వెల్లడించింది. మూడో దశ ఆంక్షలలో భాగంగా, ఇప్పటికే అమల్లో ఉన్న ఒకటి, రెండు దశల నిబంధనలతో పాటు మరిన్ని కఠిన చర్యలు చేపట్టనున్నారు. ముఖ్యంగా, ఢిల్లీ బయట రిజిస్టర్ అయిన బీఎస్4 డీజిల్ తేలికపాటి వాణిజ్య వాహనాలు (LCV) రాజధానిలోకి ప్రవేశించడంపై నిషేధం విధించారు. అయితే, నిత్యావసర సరుకులు, అత్యవసర సేవలు అందించే వాహనాలకు దీని నుంచి మినహాయింపు ఇచ్చారు. అదే సమయంలో, బీఎస్3, అంతకంటే పాత డీజిల్ వాణిజ్య వాహనాలపై పూర్తి నిషేధం కొనసాగుతుందని, వాటికి అత్యవసర సేవల్లో ఉన్నప్పటికీ ప్రవేశం లేదని స్పష్టం చేశారు. నిర్మాణ ప్రదేశాల్లో దుమ్ము నియంత్రణ చర్యలను కఠినంగా తనిఖీ చేయాలని, కాలుష్యానికి కారణమయ్యే కార్యకలాపాలపై నిఘా పెంచాలని అధికారులను CAQM ఆదేశించింది. పౌరులందరూ 'గ్రాప్3' నిబంధనలను పాటించి సహకరించాలని కోరింది. వాతావరణ శాఖ అంచనాల ఆధారంగా గాలి నాణ్యతను నిరంతరం సమీక్షిస్తామని సబ్‌కమిటీ తెలిపింది.

## హైదరాబాద్ వచ్చి తెలుగువారిని కలవడం సంతోషంగా ఉంది: మెస్సీ

హైదరాబాద్ నగరానికి వచ్చి తెలుగు ప్రజలను కలవడం చాలా సంతోషంగా ఉందని ప్రముఖ ఫుట్ బాల్ క్రీడాకారుడు లియోనల్ మెస్సీ అన్నాడు. తెలుగు ప్రజలు చూపిన అభిమానం తనకు ఎంతో శక్తిని ఇచ్చిందని పేర్కొన్నాడు. మెస్సీ హైదరాబాద్ పర్యటన సందర్భంగా ఉప్పల్ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఫ్రెండ్లీ మ్యాచ్ జరిగింది. మెస్సీ అపర్ణ మెస్సీ జట్టు తరపున, రేవంత్ రెడ్డి సింగరేణి ఆర్ఆర్ జట్టు తరపున ఆడారు. ఈ మ్యాచ్‌లో సింగరేణి ఆర్ఆర్ జట్టు 42 గోల్స్ తేడాతో అపర్ణ మెస్సీ జట్టుపై విజయం సాధించింది. మ్యాచ్ అనంతరం సింగరేణి ఆర్ఆర్ జట్టుకు మెస్సీ ట్రోఫీని అందించగా, అపర్ణ మెస్సీ జట్టుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహుమతి ప్రదానం చేశారు. కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్



గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలకు మెస్సీ పేరుతో ఉన్న జెర్సీని లియోనల్ మెస్సీ అందజేశారు.

## హెచ్-1బీ వీసా ఫీజు పెంపు..
## ట్రంప్ నిర్ణయాన్ని సవాల్ చేసిన అమెరికాలోని 20 రాష్ట్రాలు!

హెచ్ 1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయంపై సొంత దేశంలోనే వ్యతిరేకత తీవ్రమవుతోంది. తాజాగా అగ్రరాజ్యంలోని 20 రాష్ట్రాలు ట్రంప్ నిర్ణయానికి వ్యతిరేకంగా దావా వేశాయి. ఏ అధ్యక్షుడికి కూడా రాజ్యాంగాన్ని విస్మరించే అధికారం లేదని వాదించాయి. హెచ్ 1బీ వీసా ఫీజును పెంచడాన్ని గతంలో అమెరికా ఛాంబర్ ఆఫ్ కామర్స్ న్యాయస్థానంలో సవాల్ చేసిన సంగతి తెలిసిందే. తాజాగా 20 రాష్ట్రాలు వేసిన దావాకు కాలిఫోర్నియా అటార్నీ జనరల్ రాబ్ బోంటా నాయకత్వం వహించారు. ట్రంప్ నిర్ణయించిన రుసుము నిలిపివేయాలని ఈ దావాలో పేర్కొన్నారు. వలసల చట్టంతో సహా దాని సంబంధిత ఖర్చులలో ఇలాంటి కీలక మార్పులు చేసే అధికారం కేవలం కాంగ్రెస్‌కు మాత్రమే ఉందన్నారు. బోంటా విలేకరులతో మాట్లాడుతూ.. హెచ్ 1బీ వీసాలపై అదనపు రుసుములు విధించే అధికారం ట్రంప్‌నకు




లేదని పేర్కొన్నారు. 'కాంగ్రెస్ ఈ వీసా కార్యక్రమాన్ని మెరుగుపరిచింది. పరిమితులు, రుసుములు నిర్ణయించింది. అదనపు ఛార్జీలు విధించే అధికారం ఆయనకు లేదు. ఏ అధ్యక్ష యంత్రాంగం కూడా ఇమిగ్రేషన్ చట్టాన్ని తిరగరాయదు. రాజ్యాంగాన్ని, చట్టాలను ఏ అధ్యక్షుడు విస్మరించరు' అని అన్నారు. ఈ రుసుము అన్ని వర్గాలపైనా ఆర్థిక భారాన్ని మోపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల కీలక రంగాల్లో కార్మికుల కొరత ఏర్పడుతుందని అభిప్రాయపడ్డారు. ఇప్పటికే విద్య, ఆరోగ్య సంరక్షణ వంటి కీలక రంగాల్లో నైపుణ్యం కలిగిన హెచ్ 1బీ వీసాదారుల కొరత ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. ఇది మరింత తీవ్రతరం అవుతుందన్నారు.

* **భారత్‌పై సుంకాలకు వ్యతిరేకంగా తీర్మానం..!**

ఇక, భారత దిగుమతులపై ట్రంప్ ఇటీవల 50శాతం సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. దీన్ని వ్యతిరేకిస్తూ అమెరికా ప్రతినిధుల సభలోని ముగ్గురు సభ్యులు ఓ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. డెబోరా రాస్, మార్క్ వీసీ, రాజా కృష్ణమూర్తి ఈ తీర్మానం తీసుకొచ్చారు. ఈ సుంకాలు చట్టవిరుద్ధమైనవని, వీటి వల్ల అమెరికన్లకే ఎక్కువగా నష్టం కలుగుతుందని పేర్కొన్నారు.

# చమురు ట్యాంకర్‌ను సీజ్ చేసిన ఇరాన్.. సిబ్బందిలో భారతీయులు కూడా..!

భారీ పరిమాణంలో చమురును మోసుకెళ్తోన్న ఒక నౌకను ఇరాన్ సీజ్ చేసింది. గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో శుక్రవారం అర్ధరాత్రి తర్వాత ఈ ఘటన చోటుచేసుకొంది. అందులోని సిబ్బందిలో భారతీయులు కూడా ఉన్నారని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ నౌకలో మొత్తం 18 మంది సిబ్బంది ఉండగా.. వారిలో బంగ్లాదేశ్, శ్రీలంక వాసులు కూడా ఉన్నారని పేర్కొన్నాయి. "60 లక్షల లీటర్ల చమురును ఒక నౌకలో అక్రమంగా తరలిస్తున్నారు. అందుకే నౌకలోని నావిగేషన్ వ్యవస్థలన్నింటినీ నిలిపివేశారు" అని ఇరాన్ మీడియా వెల్లడించింది. గల్ఫ్‌లో అక్రమంగా ఇంధనం రవాణా చేస్తోన్న నౌకలను అడ్డుకుంటున్నట్లు ఇరాన్ ఇప్పటికే పలుమార్లు వెల్లడించింది. చమురు ఎగుమతి చేస్తోన్న దేశాల్లో ఒకటైన ఇరాన్‌లో చమురు ధరలు అతి తక్కువగా ఉంటాయి. అందుకే ఇక్కడినుంచి ఇతర దేశాలకు అక్రమంగా ఎగుమతి చేసి, కొందరు భారీ లాభాలు ఆర్జిస్తున్నారు. ఈ కార్యకలాపాలను ఇరాన్ ఎప్పటికప్పుడు అడ్డుకుంటోంది. కాగా.. వెనెజువెలా తీరంలో రెండు రోజుల క్రితం అమెరికా ఒక ఆయిల్ ట్యాంకర్‌ను సీజ్ చేసిన సంగతి తెలిసిందే. నౌక కెప్టెన్ వెనెజువెలా, ఇరాన్‌ల నుంచి అక్రమంగా చమురు రవాణా చేస్తున్నాడన్న ఆరోపణలతో ఈ నౌకను అగ్రరాజ్యం అడ్డుకుంది.



## రెండవ విడత పంచాయతీ ఎన్నికలకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు

- **ప్రజలందరూ నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి**
- **జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో రెండవ విడతలో జరగబోయే పంచాయితీ ఎన్నికలకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లను చేసినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఒక ప్రకటనను విడుదల చేశారు. మొత్తం 766పోలింగ్ స్థానాలలోని పోలింగ్ కేంద్రాలలో పోలీస్ శాఖ తరపున పూర్తిస్థాయి బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. సుమారుగా 1500 మంది పోలీసులతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా చర్యలను చేపట్టడం జరుగుతుందని అన్నారు.1392 పోలింగ్ కేంద్రాలలో సాధారణ పోలింగ్ కేంద్రాలు878,సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు179,అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు285,క్మావోయిస్టు ప్రభావిత పోలింగ్ కేంద్రాలు50 లను గుర్తించినట్లు తెలిపారు.ప్రజలందరూ నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు పోలీస్ అధికారులు,సిబ్బంది ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశాలు జారీ చేశారు.ఓటర్లను ప్రలోభ పెట్టే విధంగా ఎవరైనా నగదు,మద్యం వంటి వాటితో పట్టుబడితే చట్టపరంగా కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు.

## భాగ్యనగర్–హైదర్నగర్ వార్డుల పేర్లలో జరిగిన పొరపాటును సరిచేయాలి

- **జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందించిన సిందం శ్రీకాంత్**



కూకట్‌పల్లి, (ప్రజాస్ఫూర్తి) : కూకట్‌పల్లి జోన్‌లో ఉన్న భాగ్యనగర్ (వార్డు నం.244) , హైదర్ నగర్ (వార్డు నం.243) పేర్లలో జరిగిన పొరపాటును సరిచేయాలని కోరుతూ శనివారం కూకట్ పల్లి జోనల్ కమిషనర్ కు బీఆర్ఎస్ నాయకుడు, అడ్వకేట్ సిందం శ్రీకాంత్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ. ఎంఎస్. నం.266 ద్వారా జిహెచ్ఎంసీ ఎన్నికల వార్డుల పునర్వ్యవస్థీకరణ చేపట్టిన నేపథ్యంలో, భౌగోళికంగా హైదర్నగర్ ప్రాంతం భాగ్యనగర్ పేరుతో, భాగ్యనగర్ ప్రాంతం హైదర్నగర్ పేరుతో నమోదు కావడం వల్ల ప్రజల్లో తీవ్ర గందరగోళం నెలకొందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం హైదర్ నగర్ అని పేరున్న వార్డు (243) లో హైదర్ నగర్ ప్రాంతం లేకుండా భాగ్యనగర్ ప్రాంతం ఉండగా, భాగ్యనగర్ అని పేరున్న వార్డు (244) లో భాగ్యనగర్ ప్రాంతం లేకుండా హైదర్ నగర్ ప్రాంతం ఉండడం పరిపాలనా పరంగా తప్పుదోవ పట్టించే పరిస్థితిని సృష్టిస్తోందని తెలిపారు. ఈ పేర్ల పొరపాటు కారణంగా ఓటర్ జాబితాలు, మున్సిపల్ సేవలు, అధికారిక రికార్డులు, ప్రజాప్రతినిధుల పరిధుల విషయంలో అనేక సమస్యలు తలెత్తుతున్నాయని ఆయన వివరించారు. ప్రజల సౌకర్యం, పరిపాలనా స్పష్టత దృష్ట్యా వార్డు నం.244కు 'హైదర్ నగర్' పేరు, వార్డు నం.243కు 'భాగ్యనగర్' పేరు పెట్టేలా మార్పిడి చేయాలని జోనల్ కమిషనర్‌ను కోరినట్లు తెలిపారు.ఈ అంశంపై సంబంధిత అధికారులు సానుకూలంగా స్పందించి, త్వరితగతిన అవసరమైన సవరణ చేపడతారని ఆశిస్తున్నట్లు సిందం శ్రీకాంత్ పేర్కొన్నారు.

# రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

- **ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు పకడ్బందీ చర్యలు**
- **జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో ఆదివారం నిర్వహించనున్న రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రక్రియను శాంతియుతంగా, పారదర్శకంగా, స్వేచ్ఛాయుతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని ఏడు మండలాల్లో 156 గ్రామపంచాయతీలకు సర్పంచ్ పదవులు, 1,392 వార్డులకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా, ఎన్నికల ప్రక్రియలో భాగంగా 16 గ్రామపంచాయతీల్లో సర్పంచ్ పదవులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయని తెలిపారు. పాండురంగాపురం గ్రామపంచాయతీ పరిధిలో నామినేషన్లు దాఖలు కాకపోవడంతో పాటు, చాప్రాలపల్లి గ్రామపంచాయతీకి సంబంధించి కోర్టు కేసు పెండింగ్‌లో ఉండటంతో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడలేదని కలెక్టర్ వివరించారు.దీంతో మిగిలిన 138 గ్రామపంచాయతీల్లో సర్పంచ్ పదవులకు ఎన్నికలు జరగనున్నట్లు





తెలిపారు. అలాగే మొత్తం వార్డుల్లో 248 వార్డులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయని పేర్కొన్నారు. పాండురంగపురం గ్రామపంచాయతీ పరిధిలో 8 వార్డులు, చాప్రాలపల్లి గ్రామపంచాయతీ పరిధిలో 8 వార్డులు, పాల్వంచ మండలం సంఘం గ్రామపంచాయతీ పరిధిలో 4వ, 8వ వార్డులు, పాల్వంచ మండలం సోములగూడెం గ్రామపంచాయతీ పరిధిలో 1వ, 3వ వార్డులు, అశ్వారావుపేట మండలం కేసప్పగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని 2వ వార్డుకు నామినేషన్లు దాఖలు కాకపోవడంతో, మిగిలిన 1,123 వార్డులకు ఆదివారం ఉదయం 7.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. పోలింగ్ ముగిసిన అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టి అదే రోజున ఫలితాలు ప్రకటించేలా అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. ఇందుకోసం లెక్కింపు కేంద్రాల్లో అవసరమైన సిబ్బంది, భద్రతా ఏర్పాట్లు, మౌలిక వసతులు సిద్ధం చేసినట్లు వెల్లడించారు.రెండవ విడత ఎన్నికలు అన్నపురెడ్డిపల్లి, అశ్వారావుపేట, చంద్రుగొండ, చుంచుపల్లి, దమ్మపేట, ములకపల్లి, పాల్వంచ మండలాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ విడతలో మొత్తం 1,392 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, 2,11,892 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని కలెక్టర్ వివరించారు.ప్రతి పోలింగ్ కేంద్రంలో తాగునీరు, విద్యుత్, ఫర్నిచర్ తదితర మౌలిక వసతులు అందుబాటులో ఉంచామని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, సీల్స్, ఓటర్ల జాబితాలు, ఫారాలు తదితర అన్ని ఎన్నికల సామగ్రిని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల ద్వారా సంబంధిత పోలింగ్ కేంద్రాలకు ఇప్పటికే తరలించడం జరిగిందని పేర్కొన్నారు. పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు సమయానికి చేరుకుని విధులు నిర్వహించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.పోలింగ్ సిబ్బంది, సెక్టార్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు, రిటర్నింగ్ అధికారులకు ముందుగానే శిక్షణ అందించామని, ఎన్నికల నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.భద్రతా పరంగా జిల్లా పోలీస్ శాఖతో సమన్వయం చేసి సున్నితమైన, అత్యంత సున్నితమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించి అదనపు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, చెక్‌పోస్టులు, మొబైల్ పెట్రోలింగ్ ద్వారా అక్రమ నగదు, మద్యం రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కీలక పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణ చేపడుతున్నట్లు తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పర్యవేక్షణకు ఐడీఓసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ద్వారా ఎన్నికల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే స్పందించేందుకు ప్రత్యేక బృందాలు సిద్ధంగా ఉన్నాయని జిల్లా కలెక్టర్ తెలిపారు.ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ విజ్ఞప్తి చేశారు.రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ఎన్నికల సిబ్బంది అందరూ ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటిస్తూ సహకరించాలని కోరారు.జిల్లాలో రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికలు శాంతియుతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు.



## డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కొత్తగూడెం క్లబ్ లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో ఎన్నికల సామాగ్రి పంపిణీ తీరుతెన్నులను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ శనివారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలలో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.పోలింగ్ సిబ్బందికి అవసరమైన తాగునీటి వసతి, అల్పాహారం, భోజన వసతి, షామియానాలు తదితర అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అలాగే పీ.ఓలు, ఓ.పీ.ఓలతో కూడిన పోలింగ్ బృందాలన్నీ హాజరయ్యారా లేదా అన్న విషయాన్ని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.ఎటువంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని పక్కాగా అందించాలని, చెక్ లిస్ట్ ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందిందా లేదా అన్నది ప్రతి అధికారి జాగ్రత్తగా పరిశీలించుకోవాలని కలెక్టర్ సూచించారు.పోలింగ్ సిబ్బందితో పాటు ఓటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాలను కలెక్టర్ పరిశీలించారు. సిబ్బంది సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు చేరుకునేలా సమర్థవంతమైన పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ప్రత్యేకించి పోలింగ్ సామాగ్రి, ముఖ్యంగా బ్యాలెట్ పేపర్లు తరలించే సమయంలో తప్పనిసరిగా సాయుధ పోలీసులతో కూడిన బందోబస్తు ఉండాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సంబంధిత ఆర్.ఓలకు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామపంచాయతీ ఎన్నికలను పూర్తిస్థాయిలో సమర్థవంతంగా, ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్వహించాలని ఎన్నికల సిబ్బందికి సూచించారు. ఎన్నికల నిర్వహణలో ఏ చిన్న సమస్య తలెత్తినా వెంటనే సంబంధిత పై అధికారులను సంప్రదించి పరిష్కారం పొందాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం పారదర్శకంగా, శాంతియుతంగా సాగేందుకు ప్రతి సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ తెలిపారు. ఈ పరిశీలనలో సంబంధిత శాఖల అధికారులు ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సేవకు గుర్తింపుగా.. ప్రజల అభిప్రాయంతోనే సర్పంచ్ గా బరిలో నిలిచా

- **కొలను శిల్ప శ్రీనివాస్ రెడ్డి**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: నా భర్త గ్రామానికి చేసిన సేవలు గుర్తించి.. గ్రామ ప్రజల అభిప్రాయం మేరకే సర్పంచ్ అభ్యర్థిగా పరిధిలో నిలిచానని అల్లాపురం గ్రామ స్వతంత్ర సర్పంచ్ అభ్యర్థి కొలను శిల్ప శ్రీనివాస్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండలం అల్లాపురం గ్రామంలో అభిమానులు, నాయకులతో కలిసి ఆమె శనివారం ముమ్మారంగా ప్రచారం నిర్వహించారు. అంతకుముందు గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులకు కుంకుమ బొట్టుపెట్టి ఆప్యాయంగా పలకరించారు. ఉంగరం గుర్తుకు ఓటు వేయాలంటూ కోరారు. ఈ సందర్భంగా కులను శిల్ప శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రచారంలో భాగంగా ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించిందన్నారు. ఇంటింటికి వెళ్లే ప్రచారం చేస్తున్న క్రమంలో ప్రజలు గతంలో తన భర్త సర్పంచ్ గా చేసిన అభివృద్ధి పనులు గుర్తుచేయడం సంతోషంగా ఉందన్నారు. ఆ సేవను గుర్తించిన ప్రజలే తమకు మార్గ నిర్దేశం చేస్తూ, సర్పంచ్ గా బరిలోకి దిగాలన్న అభిప్రాయం వ్యక్తం చేశారన్నారు. ప్రజల నుంచి వస్తున్న అశేష ఆదరణ ఊహించలేదన్నారు. ప్రజలు మేమున్నాం మీరు బరిలోకి దిగాలన్న మాట అంగీకరించాక తప్పలేదన్నారు. ప్రజల ప్రేమాభిమానాలకు ఎప్పుడు కృతజ్ఞులుగా ఉంటామన్నారు. మరల ప్రజలు ఆదరించి, అవకాశం ఇవ్వాలని కోరారు. ఉంగరం గుర్తుకు ఓటు వేసి తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు.

# వరుసల్లో మెరిసిపోతోంది..!

**ధగధగ మెరిసే నగ అమ్మాయి మెడలో చేరిందంటే చాలు లక్ష్మీ కళ వచ్చేస్తుంది. అలాగని ఏదో ఒక డిజైను అని సరిపెట్టేసుకోలేం. వేసుకునే దుస్తులూ, సందర్భాన్ని బట్టి కొత్తదనం కనిపించాలని కోరుకుంటాం. అందుకే, మగువల మనసు తెలుసుకున్న తయారీదారులు ఎప్పటికప్పుడు నయా మోడళ్లను మార్కెట్‌లోకి తెస్తుంటారు. అలా నిన్నమొన్నటి వరకూ టెంపుల్ జ్యుయెలరీ పేరుతో భారీ పనితనంతో తీర్చిదిద్దిన హారాలు, పెండెంట్లదే హవా. ఇప్పుడు మాత్రం సింపుల్‌గా కనిపిస్తూనే రిచ్‌లుక్‌ని ఇచ్చే డిజైన్ల కోసం వెతుకుతున్నారు. ముఖ్యంగా ఒకేలాంటి డిజైన్‌తో తీర్చిదిద్దిన లేయర్డ్ హారాలను ఇష్టపడుతున్నారు. దీనికోసమే సంప్రదాయ దుస్తులతో పాటు మోడర్న్ డ్రెస్‌ల మీదకూ నప్పేలా వీటిని రూపొందిస్తున్నారు. అలా ముత్యాలు, పచ్చలు, పగడాలు, కుందన్లు, పోల్కీలు, వజ్రాలు వంటివాటితో తయారు చేసిన వీటిని మీరూ ఓ సారి చూసేయండి.**















# నల్లమల సాగర్ ప్రాజెక్టుకు అనుమతులివ్వొద్దు: కేంద్రానికి ఉత్తమ్ లేఖ

హైదరాబాద్: కృష్ణా, గోదావరి నీటి కేటాయింపులు, తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు కోరుతూ కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి కాంతారావుకు తెలంగాణ జలవనరుల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లేఖ రాశారు. ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదిస్తున్న నల్లమల సాగర్ ప్రాజెక్టు, ఆల్మట్టి డ్యాం కోసం కర్ణాటక చేపడుతున్న భూ సేకరణకు అనుమతులు నిరాకరించాలని కోరారు. గోదావరి నీటిని తరలించేందుకు ఏపీ ప్రభుత్వం కొత్తగా నల్లమల సాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి సిద్ధమవుతోందని, ఇది బచావత్ ట్రైబ్యునల్ తీర్పునకు విరుద్ధంగా ఉందని లేఖలో పేర్కొన్నారు. గతంలో పోలవరం బనకచర్ల ప్రాజెక్టును ఏపీ ప్రతిపాదించగా.. ప్రీ ఫీజిబిలిటీ నివేదికను కేంద్ర అటవీ, పర్యావరణశాఖ తిరస్కరించినట్లు గుర్తు చేశారు. ఆ ప్రాజెక్టు స్థానంలో తాజాగా నల్లమల సాగర్ నిర్మాణానికి డీపీఆర్ తయారీ కోసం ఏపీ సర్కారు



టెండర్ నోటీసు విడుదల చేసిందని పేర్కొన్నారు. 2026-2031 సంవత్సరాలకు తెలంగాణలోని ప్రాణహిత చేవెళ్ల సుజల స్రవంతి, నారాయణ్‌పేట్ కొడంగల్ లిఫ్ట్, సీతారామ లిఫ్ట్, పాలమూరు, రంగారెడ్డి లిఫ్ట్, ముక్తేశ్వర్ లిఫ్ట్, మోడికుంట వాగు, చనకకొరాట ప్రాజెక్టులకు పీఎంకేఎస్‌వైఏఐబీపీ కింద నిధులు కేటాయించాలని ఉత్తమ్ విజ్ఞప్తి చేశారు. కృష్ణా ట్రైబ్యునల్ 2 విచారణ త్వరగా పూర్తి చేసి.. ఈ ప్రాజెక్టులకు అనుమతులివ్వాలని కోరారు. పాలమూరు రంగారెడ్డి తొలిదశ, సమ్మక్క సారక్క ప్రాజెక్టుల డీపీఆర్‌లు ఇప్పటికే కేంద్ర జలసంఘానికి అందించామని తెలిపారు. ఈ రెండు ప్రాజక్టులకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని కోరారు. మంత్రి రాసిన లేఖను రాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా.. జలశక్తి కార్యదర్శికి అందజేశారు.

## రోడ్డు ప్రమాదం.. ఒకే కుటుంబంలో నలుగురి మృతి

పెద్దశంకరంపేట: మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండలం కోలపల్లి గ్రామ సమీపంలో శనివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. పంచాయతీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వెళ్తున్న క్రమంలో ఈ దుర్ఘటన జరిగింది. మృతులు కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం మాగీ గ్రామానికి చెందిన లింగమయ్య, సాయమ్మ, సాయిలు, మానసగా గుర్తించారు. ప్రమాద సమాచారం




అందుకున్న వెంటనే పెద్ద శంకరంపేట ఎస్ ఐ ప్రవీణ్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ఒకే కారులో రాహుల్, రేవంత్, టీపీసీసీ చీఫ్.. ప్రభుత్వ పనితీరుపై సంతృప్తి

లియోనెల్ మెస్సి ఫుట్ బాల్ మ్యాచ్ సందర్భంగా శనివారం హైదరాబాద్‌కు వచ్చిన రాహుల్ గాంధీకి సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, ముఖ్య నేతలు శంషాబాద్ విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం రాహుల్‌తో పాటు సీఎం రేవంత్ రెడ్డి, మహేష్ కుమార్ గౌడ్ ఒకే కారులో ఫలక్‌నుమా ప్యాలెస్‌కు బయలుదేరారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో తాజా రాజకీయ



పరిస్థితులను సీఎం, పీసీసీ చీఫ్ రాహుల్‌కు వివరించారు. ఇటీవల హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించిన తీరు, గ్రామ పంచాయతీ మొదటి విడత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు ఘన విజయం సాధించిన విషయాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలో ప్రభుత్వ, పార్టీ పనితీరుపై రాహుల్‌గాంధీ సంతృప్తి వ్యక్తం చేశారని నేతలు తెలిపారు.

**ఢిల్లీకి సీఎం రేవంత్ రెడ్డి..**

ఓటుచోరీ అంశంపై ఢిల్లీలో నేడు జరిగే నిరసన ర్యాలీలో పాల్గొనేందుకు సీఎం రేవంత్ రెడ్డి శనివారం రాత్రి ఢిల్లీకి పయనమయ్యారు. ఉప్పల్ స్టేడియంలో మ్యాచ్ ముగిసిన అనంతరం రాహుల్ గాంధీతో పాటు ఆయన ప్రత్యేక విమానంలో హస్తినకు వెళ్లడం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది.

## ఉప్పల్ స్టేడియం వద్ద అభిమానుల సందడి

**హైదరాబాద్: ఉప్పల్ స్టేడియంలో మెస్సి - గోట్ ఫుట్‌బాల్ మ్యాచ్ వీక్షించేందుకు అభిమానులు భారీగా తరలివచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి, మెస్సి కలిసి మ్యాచ్ ఆడనున్న నేపథ్యంలో ఉప్పల్ స్టేడియం వద్ద అభిమానుల సందడి నెలకొంది. తమ అభిమాన ఆటగాడిని చూసేందుకు అభిమానులు భారీగా ఉప్పల్ స్టేడియానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన లేజర్ షో ఆకట్టుకుంది. మ్యూజికల్ ఈవెంట్‌లో రాహుల్ సిప్లిగంజ్, మంగ్లి అలరించారు.**




















## ఆ సంస్థకు డిపార్ట్‌మెంటల్ హోదా కల్పించాలి: ప్రొఫెసర్ కోదండరాం

విత్తన హబ్‌గా చెప్పుకునే తెలంగాణలో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడంలో విత్తన ధ్రువీకరణ సంస్థ పాత్ర అత్యంత కీలకమని, విత్తన ధృవీకరణ జరిగితేనే రైతుకు నాణ్యమైన విత్తనం అందుతుందని టీజేఎస్ చీఫ్, ప్రొఫెసర్ కోదండరాం పేర్కొన్నారు. కల్తీల విషయంలో జవాబుదారీ తనం ఉంటుందని, సంస్థ చిన్నదైన సీడ్ సర్టిఫికేషన్ అధికారులు ఆవశ్యకత చాలా ముఖ్యమైనదన్నారు. శనివారం విత్తన ధృవీకరణ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం పాల్గొని ప్రసంగించారు. సంస్థ అభివృద్ధి విషయంలో ప్రభుత్వం కూడా ప్రత్యేక దృష్టి సాధించి, విత్తన ధృవీకరణ సంస్థకు డిపార్ట్మెంట్ హోదా కల్పిస్తూ, ట్రెజరీ నుంచి నేరుగా ఉద్యోగుల జీతాలు ఇచ్చి, సంస్థను ఆర్థిక సమస్యల నుంచి అధిగమించేలా చేయాలని కోరారు. విత్తన ధృవీకరణ కూడా సమర్థవంతంగా జరిగి, సంస్థ అనుకున్న లక్ష్యాలను సాధించి, రైతులకు నాణ్యమైన సర్టిఫైడ్ విత్తనాలను అందించే అవకాశం ఉందని, త్వరలో వీటిపైన



సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రి తుమ్మలకు లిఖిత పూర్వకంగా తెలియజేస్తానని హామీ ఇచ్చారు. డిపార్ట్ మెంటల్ హోదా కల్పించడంతో రాష్ట్రంలో విత్తనాలకు సంబంధించిన అన్ని కార్యక్రమాలు ఒకే పరిపాలనలోకి వచ్చి, సమగ్ర పర్యవేక్షణతో రైతులకు నాణ్యమైన ధృవీకరణ విత్తనాల సరఫరా సాధ్యమవుతుందన్నారు. ఇప్పటికే విత్తన ధ్రువీకరణ సంస్థకు తెలంగాణ ప్రభుత్వం గ్రాంట్ ఇన్ఎయిడ్ రూపంలో టెక్నికల్ స్టాఫ్‌కు జీతాలు ఇస్తుందని, అదేవిధంగా, విత్తన ధృవీకరణ చార్జీల ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుంటే, ఈ సంస్కరణ వలన ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడే అవకాశం కూడా ఉండదన్నారు. కేంద్రం తీసుకొస్తున్న కొత్త విత్తన చట్టంలో విత్తన ధ్రువీకరణ సంస్థకు ప్రత్యేకత ఉందని, రాష్ట్రంలోనే కాకుండా, దేశంలో సీడ్ సర్టిఫికేషన్ ను తప్పనిసరి చేసి, రైతులకు సర్టిఫైడ్ విత్తనాలే సరఫరా చేయాలని, విత్తన బిల్లు రాకముందే ఇప్పటికే తమిళనాడు, కేరళ, సిక్కిం, జమ్మూ కాశ్మీర్, ఢిల్లీ వంటి అనేక రాష్ట్రాలు తమ సీడ్ సర్టిఫికేషన్ అథారిటీలను వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలోకి తెచ్చాయని గుర్తుకు చేశారు. తమిళనాడు లాంటి రాష్ట్రంలో కేవలం సర్టిఫైడ్ వరి విత్తనాలనే రైతులకు అందించాలని, మహారాష్ట్రలో అన్ని పంటల నోటిఫైడ్ రకాలను తప్పనిసరిగా సర్టిఫికేషన్ చేయించుకోవాలని ఆయా ప్రభుత్వాలు నిబంధనలు తీసుకవచ్చాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు పెన్షన్ ను రూ. 30 వేలకు పెంచాలని, విత్తన ధ్రువీకరణ సంస్థకు ఒక డిపార్ట్ మెంటల్ స్టేటస్ ను కల్పించి వ్యవసాయ శాఖ లో ఒక ప్రత్యేక విభాగం క్రింద చేర్చాలన్నారు.

## సింగరేణి బొగ్గు ధరల తగ్గింపుపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కీలక ఆదేశాలు

సింగరేణి సంస్థ సుస్థిర మనుగడ కోసం తక్షణమే తన బొగ్గు ధరల తగ్గింపు, నాణ్యత పెంపుదలపై దృష్టి సారించాలని, కొత్త బ్లాకులు సాధించడానికి చొరవ చూపాలని, కార్మిక సంక్షేమంలో ఎలాంటి రాజీ పడకుండా చర్యలు తీసుకోవాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో ఆయన శనివారం సింగరేణి సంస్థపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. బొగ్గు రంగంలో తాము కొన్ని సంస్కరణలు తీసుకురాబోతున్నామని, ఇకపై ప్రభుత్వ సంస్థలు పూర్తి




అంకితభావంతో పనిచేస్తే తప్ప వాటిని ఎవరూ రక్షించలేరని ఆయన పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని నూతన కార్మిక చట్టాలను అమలులోకి తీసుకొచ్చామన్నారు. వీటిని పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. సింగరేణిలో కార్మికుల సంక్షేమం విషయంలో ఎలాంటి రాజీ పడకుండా చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. అదే సమయంలో మానవ వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. కొత్త బ్లాకులను సాధించడం కోసం ప్రణాళిక బద్ధంగా పనిచేయాలన్నారు. సింగరేణి సంస్థ ప్రధాన వ్యాపకం బొగ్గు ఉత్పత్తి కాబట్టి బొగ్గు నాణ్యత ప్రమాణాల పెంపుదలకు వాషరీలను ఏర్పాటు చేయాలని, కొత్తగా వచ్చిన డ్రై వాషరీలను కూడా ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. సింగరేణి భవిష్యత్ కోసం సమగ్ర కార్యాచరణ ప్రణాళికలను రూపొందించి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

## రెండో విడత పంచాయతీ ఎన్నికలు.. ఉప్పల్‌లో ప్రయాణికుల రద్దీ

హైదరాబాద్: తెలంగాణలో రెండో దశ పంచాయతీ ఎన్నికలు ఆదివారం జరగనున్నాయి. ఓటు హక్కును వినియోగించుకొనేందుకు భాగ్యనగరంలో ఉంటున్న ప్రజలు తమ స్వగ్రామాలకు బయలుదేరారు. ఈ క్రమంలోనే నగరంలోని జూబ్లీ బస్ స్టేషన్, ఉప్పల్ బస్ స్టాప్ వద్ద రద్దీ నెలకొంది. ఊళ్లకు వెళ్లే వారితో ఉప్పల్ ప్రాంతమంతా సందడిగా మారింది. దీంతో ఆ మార్గంలో భారీగా ట్రాఫిక్ జామ్ నెలకొంది. వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. రెండో దశ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఏకగ్రీవాలు కాకుండా 3,911 పంచాయతీలకు సర్పంచులు, 29,903 వార్డు సభ్యుల స్థానాలకు పోలింగ్ జరగనుంది.





# పని చేయకుండానే ప్రధాని కావాలనుకుంటున్నారు - రాహుల్‌పై పంజాబ్ సీఎం విమర్శలు

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతోపాటు మాజీ క్రికెటర్ నవ్‌జోత్ సింగ్ సిద్ధూలపై పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ ఇద్దరు నేతల్లో ఒకే విధమైన సమస్య ఉందన్నారు. వీరు క్షేత్రస్థాయిలో పనిచేయకున్నా ఉన్నత స్థాయి పదవుల కోసం ఆరాటపడుతున్నారని విమర్శించారు. ''నన్ను ప్రధానమంత్రి చేయండి.. ప్రజల కోసం ఏదో ఒకటి చేస్తా అని రాహుల్ గాంధీ చెబుతుంటారు. కానీ, ముందు మీరు ఏదో ఒకటి చేయండి.. అప్పుడు మిమ్మల్ని ప్రధానిని చేస్తామని ప్రజలు ఆయన్ను ప్రశ్నిస్తున్నారు. నవ్‌జోత్ సింగ్ సిద్ధూతోనూ ఇదే సమస్య. తనను సీఎం చేస్తే పంజాబ్ కోసం ఏదో ఒకటి చేస్తానని అంటున్నారు'' అని భగవంత్ మాన్ పేర్కొన్నారు. పంజాబ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో సిద్ధూ మంత్రిగా ఉన్నప్పటికీ..



ప్రజా సంక్షేమం కోసం ఏమీ చేయలేదని ముఖ్యమంత్రి మాన్ ఆరోపించారు. ఆ తర్వాత కీలక మంత్రిత్వ శాఖను అప్పగించినప్పటికీ బాధ్యతలు సరిగ్గా నెరవేర్చలేదని విమర్శించారు. దాదాపు ఆరు నెలల పాటు ఆయన శాఖకు చెందిన దస్త్రాలపై సంతకాలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని అమరీందర్ సింగ్ చెప్పిన విషయాన్ని మాన్ గుర్తుచేశారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి అభ్యర్థిగా సిద్ధూను కాంగ్రెస్ ప్రకటిస్తే రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటారని ఆయన సతీమణి నవ్‌జోత్ కౌర్ సిద్ధూ ఇటీవల పేర్కొన్న విషయం తెలిసిందే. ఏ పార్టీకి నిధులు సమకూర్చేందుకు తమ వద్ద డబ్బుల్లేవని, తాము అధికారంలోకి వస్తే మాత్రం పంజాబ్‌ను బంగారు రాష్ట్రంగా మారుస్తామని ఆమె చెప్పిన నేపథ్యంలో మాన్ ఈ విమర్శలు చేశారు.

## ఈ కొల్హాపురి చెప్పుల ధర రూ.51 వేలు

భారత్‌లో సంప్రదాయ పాదరక్షల్లో కొల్హాపురి చెప్పులకు పెట్టింది పేరు. ఇటీవల ఇటలీకి చెందిన ఓ లగ్జరీ వస్తువుల సంస్థ వీటిని కాపీ కొట్టిందనే ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అదే దేశానికి చెందిన పౌరుడు రూ.51 వేలు ఖర్చుపెట్టి కొల్హాపురి చెప్పులు కొనుగోలు చేయడం గమనార్హం. మహారాష్ట్ర కొల్హాపుర్ జిల్లాలోని బాంగే గ్రామానికి చెందిన రాజేంద్ర గోవిందా శిందే.. బీఈడీ పూర్తి చేసి ఉపాధ్యాయుడిగా కొంతకాలం పనిచేశారు. ఆ తర్వాత సంప్రదాయ చెప్పుల తయారీపై దృష్టి సారించారు. 25 ఏళ్లుగా ఈ వృత్తిలోనే కొనసాగుతూ కొత్త ప్రయోగాలతో వీటి ఖ్యాతి పెంచే ప్రయత్నం చేస్తున్నారు. ఇటీవల ఆయన రూపొందించిన ఓ డిజైన్ అంతర్జాతీయ దృష్టినీ ఆకర్షించింది. బరువు తక్కువగా ఉండే ఈ పాదరక్షలు పాలిష్ చేయకున్నా మెరుస్తాయి. ఒక్కో చెప్పు బరువు కేవలం 211 గ్రాములు. మందం ఒక



మిల్లీమీటరు. మూడేళ్లపాటు మన్నిక ఇస్తాయి. కొల్హాపురి చప్పల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో మాస్టర్ ట్రైనర్‌గా ఉన్న రాజేంద్ర.. ఇందులో ఆసక్తికలిగిన వారికి శిక్షణ ఇస్తూ ఉపాధి కల్పనలో తోడ్పాటు అందిస్తున్నారు. రాజేంద్ర ఇటీవల ప్రత్యేకంగా రూపొందించిన ఈ చెప్పులు అంతర్జాతీయ దృష్టినీ ఆకర్షించాయి. గత నెల దిల్లీలో నిర్వహించిన అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శనలోనూ ఉత్తమ పాదరక్షలుగా నిలిచాయి. దీంతో ఇటలీతోపాటు విదేశాల నుంచి ఆర్డర్లు వస్తున్నాయట.

## కేరళలో భాజపా సరికొత్త చరిత్ర.. మోదీ హర్షం

తిరువనంతపురం కార్పొరేషన్ ఎన్నికల్లో భాజపా విజయం సాధించడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. కేరళ రాజకీయాల్లో ఇదో కీలక మలుపుగా అభివర్ణించారు. క్షేత్రస్థాయిలో తమ కార్యకర్తలు చేసిన కృషి వల్లే దాదాపు 45 ఏళ్లుగా ఈ స్థానంలో అధికారంలో ఉన్న ఎల్‌డీఎఫ్‌ను ఓడించగలిగినట్లు పేర్కొన్నారు. ఈ విజయం కోసం శ్రమించిన భాజపా కార్యకర్తలను అభినందించారు. కేరళ అభివృద్ధి భాజపాతో మాత్రమే సాధ్యమని ప్రజలు నమ్మడం వల్లే తమ పార్టీ విజయం సాధించిందన్నారు. తిరువనంతపురం అభివృద్ధికి, ప్రజల జీవన ప్రమాణాలు పెంచడానికి భాజపా కృషి చేస్తుందని హామీ ఇచ్చారు.



*** ఎన్నికల ఫలితాల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తి: శశిథరూర్**

తిరువనంతపురం కార్పొరేషన్ ఎన్నికల్లో విజయం సాధించిన భాజపా నేతలకు కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఫలితాలు నిజమైన ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనమన్నారు. 45 ఏళ్లుగా అధికారంలో ఉన్న ఎల్‌డీఎఫ్ చేస్తున్న అక్రమాలను చాలా సార్లు ప్రశ్నించానని..వారి పాలన నుంచి బయటపడాలని ప్రజలు కూడా కోరుకుంటున్నట్లు ఈ ఫలితాలతో తేలిందన్నారు.

*** తిరువనంతపురం కార్పొరేషన్ ఎన్నికల్లో భాజపా విజయం**

తిరువనంతపురం కార్పొరేషన్ ఎన్నికల్లో భాజపా నేతృత్వంలోని ఎన్డీఏ విజయం సాధించింది. ఈ గెలుపుతో 45 ఏళ్లుగా ఆ స్థానంలో అధికారంలో ఉన్న వామపక్ష పాలనకు ముగింపు పలికింది. తిరువనంతపురం కార్పొరేషన్‌లోని 101 వార్డుల్లో భాజపా 50, ఎల్డీఎఫ్ 29, యూడీఎఫ్ 19, స్వతంత్ర అభ్యర్థులు రెండు స్థానాలు గెలుచుకున్నారు.

## ఇలాంటి అబ్బాయిలకు గుణపాఠం నేర్పించాల్సిందే: సుప్రీంకోర్టు

ముంబయిలో గతేడాది చోటుచేసుకున్న హిట్ అండ్‌రన్ కేసులో సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. తనకు బెయిల్ ఇవ్వాల్సిందిగా కోరుతూ.. నిందితుడు మిహిర్ షా వేసిన పిటిషన్‌పై దర్యాప్తునకు నిరాకరించింది. ఇలాంటి అబ్బాయిలకు తగిన గుణపాఠం నేర్పించాల్సిందేనని వ్యాఖ్యానించింది. హిట్ అండ్ రన్ కేసులో బైక్‌పై వస్తోన్న వారిని అతివేగంగా తన కారుతో



ఢీకొట్టడమే కాకుండా నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడని జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఏజీ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. చేసిన నేరానికి గానూ అతడు కొద్ది రోజుల పాటు జైల్లోనే ఉండాలని ఆదేశించింది. గతేడాది ముంబయిలోని వర్లీ ప్రాంతంలో శివసేన నేత రాజేశ్ షా కుమారుడు మిహిర్ షా మద్యం మత్తులో బీఎండబ్ల్యూ కారును వేగంగా నడుపుతూ ముందు వెళ్తున్న స్కూటీని ఢీకొట్టాడు. దీంతో స్కూటీపై ఉన్న దంపతులు ఎగిరిపడ్డారు. వేగంగా వెళ్తున్న కారు మహిళపై నుంచి దూసుకెళ్లడంతో కావేరి నక్వా (45) అక్కడికక్కడే మరణించగా.. ఆమె భర్త గాయపడ్డారు. అయితే, ప్రమాదం తర్వాత మిహిర్ ఘటనకు కొద్ది దూరంలో తన కారును వదిలేసి ఆటోలో అక్కడి నుంచి పరారయ్యాడు. అనంతరం పోలీసులు అతడిని అరెస్టు చేశారు. ఈ కేసులో బెయిల్ ఇవ్వాలని మిహిర్ ముంబయి హైకోర్టులో పిటిషన్ వేయగా న్యాయస్థానం నిరాకరించింది. దీంతో అతడు సుప్రీంను ఆశ్రయించాడు.

## ఇది 'రాముడి' బ్యాంక్..
## ఇక్కడ నామాలే డిపాజిట్లు!




జైపూర్: బ్యాంకు అనగానే మనకు ఆర్థిక లావాదేవీలే గుర్తొస్తాయి. కానీ, కేవలం కమర్షియల్ బ్యాంకులే కాదు.. బ్లడ్ బ్యాంక్, ఫుడ్ బ్యాంక్, క్లాత్ బ్యాంక్ వంటి వాటి గురించి వింటున్నాం. చూస్తున్నాం. కానీ, రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఓ అరుదైన బ్యాంక్ ఉంది. డబ్బులు, నాణేలు కాదు.. రామ నామాలే డిపాజిట్లుగా స్వీకరించడం ఇక్కడ ఆనవాయితీ. స్థానిక గోవింద్ దేవ్ జీ ఆలయ ప్రాంగణంలో 'రామ్ నామ ధన సంగ్రహ బ్యాంక్' పేరిట ఇది కొనసాగుతోంది. బాలకృష్ణ పురోహిత్ దీన్ని ఏర్పాటు చేశారు. 1987 నుంచి నడిపిస్తున్నారు. ఈ బ్యాంకులో రామ నామాలు రాసిన పుస్తకాలను డిపాజిట్ చేస్తారు. ఇప్పటి వరకు 140 బిలియన్లకు పైగా రామ నామాలు డిపాజిట్ అయ్యాయని నిర్వాహకులు తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తుల్లో కొందరు అప్పటికే రాసిన రామ నామాల పుస్తకాలను డిపాజిట్ చేస్తారు. కొత్త పుస్తకాలను తీసుకెళతారు. అలా ఇక్కడికొచ్చిన వారి పేరిట బ్యాంక్ పాస్‌బుక్ మాదిరిగా ఒక 'మంత్ర' అకౌంట్ ఉంటుంది. అందులో ఖాతాదారుడి పేరు, ఇప్పటి వరకు ఎన్ని మంత్రాలు అతడి ఖాతాలో జమయ్యాయి వంటి వివరాలు పొందుపరుస్తారు. తాను నిర్దేశించుకున్న లక్ష్యంలో ఎన్ని చేరుకున్నారు.. ఎన్ని చేరుకోవాలనే వివరాలు అందులో ఉంటాయి. ఇక్కడ లాభనష్టాలు, వడ్డీ లేవని కేవలం భక్తి మాత్రమే ఉంటుందని నిర్వాహకులు చెబుతున్నారు. బ్యాంకుకు వచ్చే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండడంతో అద్దె భవనంలో కొనసాగుతున్న ఈ బ్యాంక్ కోసం శాశ్వత భవన నిర్మాణం చేపడుతున్నారు.

## 3 ఏళ్ల వయసు నుంచే పిల్లలను స్కూల్‌కు పంపించాలి: సుధామూర్తి

చిన్నపిల్లలున్న తల్లిదండ్రులకు రాజ్యసభ ఎంపీ సుధామూర్తి కొన్ని సూచనలు చేశారు. ప్రీ ప్రైమరీ విద్యపై తల్లిదండ్రులు, ప్రభుత్వం దృష్టిపెట్టాలని కోరారు. ''చిన్న వయసులోనే బ్రష్ చేసుకోవడం, స్వయంగా బ్రేక్‌ఫాస్ట్ చేయడం వంటివి నేర్పించాలి. పాఠశాలకు వెళ్లే అలవాటు త్వరగా ప్రారంభం కావాలి. ఇదంతా చదువు ఒత్తిడి పెంచడం కోసం కాదు. వారికంటూ ఒక దినచర్య ప్రారంభమవుతుంది. క్రమశిక్షణ అలవాటవుతుంది'' అని అన్నారు. చిన్నవయసులో ఎలా ఆలోచిస్తారు? ఏ విధంగా నేర్చుకుంటారు? ప్రపంచంతో ఎలా మమేకమవుతారనే దాన్నిబట్టి వారి భవిష్యత్ ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. రాజ్యాంగం



ప్రకారం ప్రస్తుతం ఆరు నుంచి 14 సంవత్సరాల వయసు వారికే ప్రభుత్వం ఉచితవిద్య అందించాల్సి ఉంటుంది. మూడు నుంచి ఆరేళ్ల మధ్య వయసున్న పిల్లలకు కూడా ఈ హక్కు ఉండాలని ఆమె పార్లమెంట్ వేదికగా కోరారు. ఆ సమయంలోనే ఆమె చేసిన సూచనలు వైరల్ అవుతున్నాయి. ''పిల్లలు మన భవిష్యత్తు. వారు ఉదయించే సూర్యుడివంటివారు. ఈ ప్రారంభ విద్య వారి జీవితానికి ఉపయోగపడుతుంది'' అని ఆమె మాట్లాడారు. మూడేళ్ల నుంచే అది అందేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. అందుకు తగ్గట్టుగా రాజ్యాంగంలో సవరణ తీసుకురావాలని అభ్యర్థించారు. ఈ అభ్యర్థనకు గల కారణాన్ని వివరించారు. పిల్లల మెదడులో 85 శాతం ఎదుగుదల ఆరేళ్లకు ముందే జరుగుతుందని, అందుకే ఈ వయసు కీలకమన్నారు.

## మాటలతో యుద్ధాలు గెలవలేం

**: పాక్‌కు సీడీఎస్ చురక**

హైదరాబాద్: మాటలతో యుద్ధాలు గెలవలేమని సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ పాకిస్థాన్‌కు చురకలు అంటించారు. స్పష్టమైన చర్యలతో మాత్రమే విజయం సాధ్యమని యువ అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. శనివారం హైదరాబాద్‌లో దుండిగల్‌లోని ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో జరిగిన కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌లో ఆయన మాట్లాడారు. క్రమశిక్షణ, ప్రణాళిక, వేగంగా కచ్చితమైన నిర్ణయాలను అమలుచేయడం ద్వారా అసలైన దృఢత్వం లభిస్తుందన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు తీవ్ర నష్టం వాటిల్లినప్పటికీ.. తామే విజయం సాధించామంటూ ఆ దేశం ప్రకటనలు చేసుకుంటోంది. ఈ నేపథ్యంలోనే సీడీఎస్ నుంచి స్పందన వచ్చింది. బలహీన వ్యవస్థల కారణంగా ప్రపంచంలోని పలు ప్రాంతాలు అస్థిరత్వంతో కొట్టుమిట్టాడుతున్నాయని, దానివల్ల తరచూ అభద్రత, ఘర్షణాత్మక పరిస్థితులు కనిపిస్తుంటాయని దాయాదికి కౌంటర్ ఇచ్చారు. ''అదే సమయంలో మనకు స్థిరమైన ప్రజాస్వామ్య వ్యవస్థ ఉంది. సాయుధ దళాల నైపుణ్యం, దృఢమైన వ్యవస్థలు భారత్ బలం. ప్రపంచవ్యాప్తంగా వస్తోన్న మార్పులను భారత బలగాలు అందిపుచ్చుకుంటున్నాయి'' అని చౌహాన్ అన్నారు. ఈ సందర్భంగా కొత్తగా విధుల్లోకి చేరనున్న యువ అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే దేశ సేవకు తమ పిల్లల్ని అందించిన తల్లిదండ్రులకు



ధన్యవాదాలు తెలియజేశారు. ''ఈ అకాడమీలో క్యాడెట్లకు అత్యుత్తమ శిక్షణ అందింది. విధిలో నిర్లక్ష్యం పనికిరాదు. ఎవరు చేసే తప్పులకు వారే బాధ్యులు అవుతారు. ఒకప్పుడు యుద్ధాలు క్షేత్రస్థాయిలో జరిగేవి. కానీ ఇప్పుడు సాంకేతికతదే కీలకపాత్ర. ఆపరేషన్ సిందూర్ కొనసాగుతూనే ఉంటుంది. ఎప్పుడూ అలర్ట్‌గా ఉండాలి'' అని సూచనలు చేశారు. పహల్గాం ఉగ్రదాడికి ఆపరేషన్ సిందూర్ తో భారత బలగాలు గట్టిగా బదులిచ్చిన సంగతి తెలిసిందే. ఈ దాడుల్లో జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్ కుటుంబంలోని 10 మంది ప్రాణాలు కోల్పోయిన

## పేరు మారిస్తే ప్రయోజనమేంటి?
## 'ఉపాధి హామీ పథకం'పై ప్రియాంకా గాంధీ

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును పూజ్య బాపు గ్రామీణ్ రోజ్‌గార్ యోజనగా మారుస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ స్పందించారు. ఉపాధి హామీ పథకం పేరు మార్చడం వల్ల ప్రజలకు చేకూరే ప్రయోజనమేంటని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ



చర్యలతో డబ్బు ఖర్చు తప్ప మరేమీ ఉపయోగం లేదని విమర్శించారు. వంద రోజులు ఉపాధి కల్పించి.. పల్లెప్రాంత పేదల జీవన ప్రమాణాలను మెరుగు పరచడం కోసం ఎన్నో ఏళ్లుగా అమలు చేస్తున్న ఈ కార్యక్రమానికి ఇప్పుడు పేరు మార్చాల్సిన అవసరం ఏంటో తనకు అర్థం కావట్లేదన్నారు. ఉపాధి హామీ పథకం పేరు మార్చితే..దానికి సంబంధించిన అన్ని కార్యాలయాలు, వస్తువులపై ఇప్పటికే ముద్రించిన పేరు మార్చాల్సి వస్తుందని ప్రియాంకా గాంధీ అన్నారు. ఇది ఖరీదైన ప్రక్రియ అని, చాలా డబ్బు ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. కాగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును మారుస్తూ శుక్రవారం కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అలాగే పని దినాల సంఖ్యను 100 నుంచి 125కి పెంచింది. ఒక రోజుకు ఇచ్చే కనీస వేతనాన్ని రూ.240కి సవరించింది.

## అమెరికా 'సిలికా' ప్రోగ్రామ్.. భారత్‌కు దక్కని చోటు

ఏఐ పురోగతికి అవసరమైన సిలికాన్ సప్లయ్ చైన్ కోసం అమెరికా విదేశాంగశాఖ 'ప్యాక్స్ సిలికా' ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. ఇందులో జపాన్, దక్షిణకొరియా, సింగపూర్, నెదర్లాండ్స్, యూకే, ఇజ్రాయెల్, యూఏఈ, ఆస్ట్రేలియా దేశాలు భాగంగా ఉన్నాయి. అయితే, ఇందులో భారత్‌కు చోటు దక్కకపోవడం గమనార్హం. దీన్ని లక్ష్యంగా చేసుకొని ప్రతిపక్ష కాంగ్రెస్ ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించింది. హైటెక్ సరఫరా గొలుసులపై చైనా ఆధిపత్యాన్ని తగ్గించేందుకు అమెరికా దీన్ని ఏర్పాటుచేసినట్లు ఆ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు. ఇటీవల మోదీ-ట్రంప్ సంబంధాల్లో వచ్చిన అపార్థాల నేపథ్యంలో భారత్‌కు ఇందులో చోటు దక్కదని తాము భావించామని, ఈవిషయం తమను ఆశ్చర్యపరచలేదని ఎద్దేవా



చేశారు. ఈ బృందంలో భాగమై ఉంటే.. అది మనకు ఎంతో ప్రయోజనకరంగా ఉండేదని అభిప్రాయపడ్డారు. గొప్ప స్నేహితుడైన ట్రంప్‌తో గురువారం ఫోన్‌లో మాట్లాడినట్లు మోదీ ఎక్స్‌లో పోస్టు చేసిన విషయాన్ని ఈసందర్భంగా ప్రస్తావించారు. ఇక, యూఎస్ స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రకారం.. సిలికాన్ సరఫరా కోసం బలవంతంగా ఇతర దేశాలపై ఆధారపడకుండా ఉండేందుకు ఈ 'ప్యాక్స్ సిలికా' ప్రోగ్రామ్‌ను తీసుకొచ్చినట్లు పేర్కొంది. ఏఐకి సంబంధించిన పరికరాలు, సామర్థ్యాలను రక్షించడంతో పాటు, సాంకేతికతల అభివృద్ధిలో భాగంగా దీన్ని ఏర్పాటుచేసినట్లు తెలిపింది. ఇదిలాఉండగా.. వచ్చే ఏడాది భారత్‌లో ఇండియాఏఐ ఇంపాక్ట్ సమిట్ 2026 జరగనున్న సంగతి తెలిసిందే. ఇటీవల ఫ్రాన్స్‌లో జరిగిన ఏఐ యాక్షన్ సమిట్‌లో ప్రధాని మోదీ దీన్ని ప్రకటించారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో నిర్వహిస్తున్న తొలి ఏఐ సదస్సు ఇదే.

# బీమా సొమ్ము కోసం మామను హత్య చేసిన అల్లుడు, మనవడు

అనకాపల్లి పట్టణం: బీమా డబ్బుల కోసం సొంత మామనే అల్లుడు, మనవడు కలిసి హత్య చేశారు. అనంతరం రోడ్డు ప్రమాదంగా దీన్ని చిత్రీకరించాలని చూశారు. పోలీసులు ఈ కేసును చాకచక్యంగా ఛేదించి హత్య చేసినట్లుగా నిర్ధరించారు. దారుణానికి పాల్పడిన నలుగురు నిందితులను అరెస్టు చేశారు. అనకాపల్లి డీఎస్పీ శ్రావణి శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. కసింకోట మండలం కొత్తపల్లిలో ఈనెల 9న కుర్రు నారాయణమూర్తి (54) మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. రోడ్డు ప్రమాదంలో చనిపోయినట్లు మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. మృతదేహంపై ఉన్న గాయాలు చూసి హత్య చేసినట్లుగా పోలీసులు అనుమానించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నారాయణమూర్తి పేరుమీద ఆరు నెలల క్రితం వివిధ కంపెనీల్లో రూ.1.08 కోట్లకు బీమా పాలసీలు తీసుకున్నట్టు గుర్తించారు. అతను చనిపోతే బీమా సొమ్ము



తమకు వస్తుందని భావించిన అల్లుడు సుంకరి అన్నవరం, మనవడు సుంకరి జ్యోతి ప్రసాద్ కలసి నారాయణమూర్తిని ఇనుప రాడ్డుతో తలపై కొట్టి హత్య చేశారు. ఈ కేసుతో ప్రమేయం ఉన్న ఎల్ఐసీ ఏజెంట్ భీముని నానాజీ, హత్యలో పాల్గొన్న అగ్రహారపు తాతాజీలను అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. హత్య కేసును ఛేదించిన కసింకోట సీఐ స్వామి నాయుడు, ఎస్ఐ మనోజ్ లక్ష్మణరావులను డీఎస్పీ అభినందించారు.




## సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు.. ఆదివారం నుంచి అడ్వాన్స్ బుకింగ్

హైదరాబాద్: సంక్రాంతి పండుగ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను నడపనుంది. ఆదివారం ఉదయం 8గంటల నుంచి అడ్వాన్స్ బుకింగ్ ఓపెన్ చేయనుంది. ప్రయాణికులు ముందస్తు బుకింగ్‌లు చేసుకోవాలని సూచించింది.

## యువత తమ ఆలోచనలను ఆచరణలో పెట్టాలి

అమరావతి: దేశంలో ఎక్కడా లేని విధంగా నూతన పారిశ్రామిక విధానాన్ని ఏపీలో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. పాతికేళ్ల క్రితం సీఎం చంద్రబాబు ఎలా ఆలోచించారో అందరూ చూశారని, ఐటీకి భవిష్యత్ ఉంటుందని నాటి యువతను ప్రోత్సహించి, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించారని అన్నారు. ఏపీ ఛాంబర్స్ బిజినెస్ ఎక్స్‌పోలో ఆయన మాట్లాడారు. "నేను ఐటీ రంగంలో 16 ఏళ్లు రాణించానంటే.. అందుకు




చంద్రబాబు విధానాలే కారణం. ప్రపంచం మొత్తం భారత్ వైపు చూస్తోంది. పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేసే దిశగా సీఎం చంద్రబాబు పని చేస్తున్నారు. చిన్న తరహా పరిశ్రమలు ఆ దిశగా అడుగులు వేయాలి. పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నాయి. పెద్ద పరిశ్రమలు వస్తే.. చిన్న తరహాకు అవకాశాలు ఉంటాయి. మన దేశంలో వ్యవసాయ ఉత్పత్తులకు భారీ డిమాండ్ ఉంది. అంతర్జాతీయ ప్రమాణాలకు తగ్గట్టుగా మనం పని చేయాలి. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌కు వెళ్లి సమస్యలు వివరిస్తే.. మీ పారిశ్రామిక భవిష్యత్‌కు కావాల్సిన సూచనలు ఇస్తారు. ఇలాంటి విధానం జర్మనీలో ఉంది. విద్యార్థులను పారిశ్రామిక రంగానికి అనుసంధానం చేసే వ్యవస్థ ఇది. మంత్రి నారా లోకేశ్ ఈ వ్యవస్థను దగ్గర ఉండి మానిటర్ చేస్తున్నారు. వెంచర్ క్యాపిటల్ క్రియేట్ చేసి.. మానిటైజ్ చేసే ఉద్దేశంతో ప్రభుత్వం ఏవిధంగా అడుగులు వేస్తోందో తెలుసుకోవాలి. ఒక కుటుంబం ఒక పారిశ్రామిక వేత్త విధానాన్ని అందరూ వినియోగించుకోవాలి. యువత తమ ఆలోచనలను ఆచరణలో పెట్టాలి" అని పిలుపునిచ్చారు.

## నేను ఈ స్థాయిలో ఉండటానికి వాళ్లే కారణం

అమరావతి: జీవితంలో విలువలు ఎంతో ముఖ్యమని.. వాటిని విద్యార్థులు ఆచరించాలని మంత్రి నారా లోకేశ్ అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం ఎర్రపాలెం గ్రామంలో ఉన్న డాన్ బాస్కో పాఠశాల స్వర్ణోత్సవాలకు ఆయన హాజరయ్యారు. పాఠశాలను స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. నూతనంగా ఏర్పాటు చేసిన సైన్స్ ప్రయోగశాలను ప్రారంభించారు. డాన్ బాస్కో పాఠశాల వ్యవస్థాపక ఛైర్మన్ చిన్నప్ప విగ్రహానికి పూలమాల



వేసి నివాళులర్పించారు. అనంతరం లోకేశ్ మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. తాను ఈ స్థాయిలో ఉండటానికి ఉపాధ్యాయురాలు మంజుల, అధ్యాపకులు, మంత్రి నారాయణ, రాజిరెడ్డి కారణమన్నారు. విద్యార్థులు ఏ స్థాయిలో ఉన్నా తమకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను ఎప్పటికీ మరువకూడదని సూచించారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన ఫాదర్లను సత్కరించారు.

## జరీబు భూముల సమస్యలను నెల రోజుల్లో పరిష్కరిస్తాం

**: కేంద్ర మంత్రి పెమ్మసాని**

అమరావతి: జరీబు భూముల సమస్యల పరిష్కారానికి నెల రోజుల సమయం పడుతుందని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. నేల స్వభావంపై పరీక్షలు నిర్వహించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. సీఆర్డీఏ కార్యకలాపాలపై ఆయన సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ఉండవల్లి లేఅవుట్ అభివృద్ధి ప్రారంభమైందని పేర్కొన్నారు. లంక భూముల సమస్య కూడా పరిష్కారమైందని చెప్పారు. 7 వేల ప్లాట్ల రిజిస్ట్రేషన్ పెండింగ్‌లో ఉందని వివరించారు. "భూ సమీకరణ చేయని భూముల్లో ప్లాట్లు పొందిన వారి సమస్య పెండింగ్‌లో ఉంది. అక్కడ రైతులతో ఎమ్మెల్యే, మంత్రి మాట్లాడాక భూసేకరణకు వెళ్తాం. వేరే చోట్ల ప్లాట్లు కావాలని అడిగిన వారికి లాటరీ ద్వారా కేటాయించే చర్యలు తీసుకుంటాం. పెద్ద ప్లాట్లు పొందేవారు కొంత సమయం వేచి ఉండాలి. కమర్షియల్ ప్లాట్లలో వాస్తు ప్రకారం ఉండాలని కొందరు అడిగారు. 7 ఎకరాల మేర ప్లాట్లు మార్చాల్సి ఉంటుంది. రైతులు మళ్లీ వాస్తు పేరిట రావొద్దని కోరుతున్నాం. 26 గ్రామాల్లో అభివృద్ధి పనుల డీపీఆర్‌లు సిద్ధం చేస్తున్నాం. వారంలో డీపీఆర్‌లు సిద్ధం చేసి నెలాఖరులోగా పనులు ప్రారంభిస్తాం. సామాజిక అభివృద్ధిలో భాగంగా కమ్యూనిటీ హాళ్లు, శ్మశానాలు నిర్మిస్తాం. వీటికి భూమి, నిధులు సమకూరుస్తాం. రాజధాని గ్రామాల్లో పారిశుద్ధ్య సిబ్బంది సంఖ్య పెంచుతాం" అని పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు.

*** వీఆర్ఎస్ ద్వారా అభిప్రాయ సేకరణ చేశాం: మంత్రి నారాయణ**

భూసమీకరణ చేయని భూముల్లో 921 ప్లాట్లు రైతులకు వచ్చాయని మంత్రి నారాయణ అన్నారు. రైతుల నుంచి వీఆర్ఎస్ ద్వారా అభిప్రాయ సేకరణ చేశామన్నారు. "వేరే చోట



ప్లాట్లు తీసుకోవడానికి కొందరు సమ్మతించారు. కొందరు రైతులు వేచి చూస్తామని తెలిపారు. మరికొందరు తర్వాత చెబుతామన్నారు. రైతులకు కేటాయించిన వాటిలో 7,628 ప్లాట్ల రిజిస్ట్రేషన్ పెండింగ్‌లో ఉంది. వేర్వేరు కారణాలతో రిజిస్ట్రేషన్లు చేసుకోవడం లేదు. 1,697 ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు ఎలాంటి ఇబ్బంది లేదు. ఎఫ్ఎస్ఐ పెంచాలని కొందరు రైతులు అడిగారు" అని నారాయణ తెలిపారు.



## నిరుద్యోగ యువతకు ఉచిత బ్యాంక్ కోచింగ్

ధర్మవరం నియోజకవర్గంలోని నిరుద్యోగ, ప్రతిభావంతులైన యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే లక్ష్యంతో సంస్కృతి సేవా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత బ్యాంకింగ్ కోచింగ్ కార్యక్రమం విజయవంతంగా ముందుకు సాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా, శనివారం సంస్కృతి సేవా సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాస్ రెడ్డి, ధర్మవరం నుండి ఎంపికైన 12 మంది ప్రతిభావంతులైన విద్యార్థినులకు ఒక నెలకు హాస్టల్ భోజన సదుపాయాల నిమిత్తం రూ.42,000/ విలువైన చెక్కును నంద్యాల జిల్లా 'గురు రాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సంస్థ' నిర్వాహకులకు అందజేశారు. ఒక సంవత్సరం పాటు సంపూర్ణ ఉచిత సదుపాయాలు, సంస్కృతి సేవా సంస్థ తరపున 12 మంది ఎంపికైన విద్యార్థినులకు ఒక సంవత్సరం పాటు ఉచిత బ్యాంకింగ్ కోచింగ్, ఉచిత వసతి మరియు భోజన సదుపాయాలు, అనుభవజ్ఞులైన అధ్యాపకులచే నాణ్యమైన శిక్షణ అందిస్తూ, వారు బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగం సాధించే విధంగా పూర్తి స్థాయిలో ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు.

**మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రేరణతో కార్యక్రమం:** ఈ శిక్షణా కార్యక్రమం రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్ ప్రేరణతో అమలులోకి వచ్చింది. యువతకు విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధి అవసరమని, ప్రత్యేకించి గ్రామీణ మరియు ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థినులకు సరైన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత సమాజంపై ఉందని మంత్రి స్పష్టంగా తెలియజేస్తూ ఈ కార్యక్రమానికి సత్యకుమార్ పూర్తి మద్దతు అందిస్తున్నట్లు ధర్మవరం బిజెపి కార్యాలయ వర్గాలు తెలిపాయి.

## కానిస్టేబుల్ అభ్యర్థులకు గుడ్ న్యూస్.. నియామక పత్రాల అందజేతకు ముహూర్తం ఖరారు

ఏపీలో మరో వినూత్న కార్యక్రమానికి సీఎం చంద్రబాబు నాయుడు శ్రీకారం చుట్టారు. కానిస్టేబుల్ అభ్యర్థులకు స్వయంగా తన చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేయాలని నిర్ణయించారు. 6వేల మంది కానిస్టేబుళ్లకు ఈ నెల 16న నియామక పత్రాలు ఇవ్వనున్నట్లు ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 6 వేల మంది కానిస్టేబుళ్లను భర్తీ చేసింది. నియమాక పత్రాలు అందజేసేందుకు తాజాగా కసరత్తులు ప్రారంభించింది.



గుంటూరు జిల్లా మంగళగిరి ఆరో బెటాలియన్ పరేడ్ గ్రౌండ్‌లో కానిస్టేబుల్ అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేసేందుకు ఏర్పాట్లు చేసింది. ఈ కార్యక్రమానికి కానిస్టేబుల్ అభ్యర్థుల కుటుంబ సభ్యులు హాజరయ్యేలా చర్యలు చేపట్టింది. ఇప్పటికే హోంమంత్రి అనిత, జిల్లా పోలీస్ అధికారులు ఈ ఏర్పాట్లను పరిశీలించారు. ఇక నియామక పత్రాలు అందుకున్న కానిస్టేబుళ్లకు డిసెంబర్ 22 నుంచి శిక్షణ ఇస్తారు. ఈ కార్యక్రమాన్నిసైతం సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఈ నెల 16నే ప్రారంభంకానుంది. మొత్తం 9 నెలలపాటు కానిస్టేబుళ్లకు శిక్షణ ఇస్తారు. రెండు విడుతల్లో ట్రైనింగ్ పూర్తి చేశారు. తొలుత నాలుగున్నర నెలలపాటు శిక్షణ ఉంటుంది. ఆ తర్వాత వారం పాటు సెలవులు ఇస్తారు. అనంతరం మరో నాలుగున్నర నెలలపాటు శిక్షణ ఇస్తారు. ఆ తర్వాత పోస్టింగులు ఇవ్వనున్నారు.

## ఇంద్రకీలాద్రిపై భవానీల రద్దీ.. మూడోరోజు దీక్షల విరమణ

**ఇంద్రకీలాద్రి: విజయవాడ ఇంద్రకీలాద్రిపై మూడోరోజు భవానీ దీక్షల విరమణ జోరుగా సాగుతుంది. మూడో రోజు కాబట్టి భక్తుల రద్దీ మరింత పెరిగింది. జై దుర్గా భవానీ జైకారాలతో కొండ అంతా మార్మోగుతోంది. తెల్లవారుజాము నుంచే భవానీ దీక్షాపరులు ఆలయానికి పోటెత్తారు.**









## శ్రీవారిని దర్శించుకున్న రజనీకాంత్

తమిళ సూపర్ స్టార్ తలైవ రజనీకాంత్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తన కుటుంబ సభ్యులతో కలిసి విఐపి విరామ సమయంలో ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రజనీకాంత్‌కు ఆలయ అధికారులు సాదర స్వాగతం పలికారు. దర్శన ఏర్పాట్లు చేశారు. రజినీ కాంత్ కుటుంబ సభ్యులు ముందుగా ధ్వజస్తంభానికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రజనీకాంత్ శ్రీవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆయనకు ఆలయ అధికారులు



స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. శ్రీవారి దర్శనం ముగించుకుని ఆలయం వెలుపలకు వచ్చిన రజనీకాంత్‌ను చూసేందుకు భక్తులు, అభిమానులు పెద్ద ఎత్తున పోటీపడ్డారు.

## ఇలాంటి ఉద్యోగాలు మన తరంతోనే ఆఖరు

**మైక్రోసాఫ్ట్ ఇండియా హెడ్ పునీత్ చందోక్**

**స్థిరమైన ఉద్యోగాల శకం ముగిసిందన్న పునీత్**

**ఏఐ ఉద్యోగాలను దొంగిలించదు, వాటి స్వరూపాన్ని మారుస్తుందని వెల్లడి**

**నేర్చుకోవడానికి నిరాకరించడమే**

**ఉద్యోగాలకు అసలైన ముప్పు అని హెచ్చరిక**



**న్యూఢిల్లీ:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ప్రస్తుత ఉద్యోగాల భవిష్యత్తుపై మైక్రోసాఫ్ట్ ఇండియా, సౌత్ ఏషియా ప్రెసిడెంట్ పునీత్ చందోక్ కీలక వ్యాఖ్యలు చేశారు. టెక్ ప్రపంచంలో స్థిరమైన, దీరకాలిక ఉద్యోగాలు అనుభవిస్తున్న మన తరమే చివరిదని, భవిష్యత్తులో ఉద్యోగాల స్వరూపం పూర్తిగా మారిపోతుందని ఆయన అభిప్రాయపడ్డారు. మైక్రోసాఫ్ట్ ఏఐ టూర్‌లో భాగంగా సీఈఓ సత్య నాదెళ్ల కార్యక్రమం సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

"మీరూ నేనూ స్థిరమైన ఉద్యోగాలు కలిగి ఉండే చివరి తరం. మన పిల్లలు వివిధ రకాల పనుల పోర్ట్‌ఫోలియో (గిగ్ వర్క్) చేపడతారు" అని చందోక్ స్పష్టం చేశారు. ఏఐ ఉద్యోగాలను దొంగిలించదని, కేవలం వాటిని విడదీస్తుందని (అన్‌బండిల్) ఆయన వివరించారు. ఒకప్పుడు ఏదైనా ఒకటి నేర్చుకుని, జీవితాంతం అదే నైపుణ్యంతో కెరీర్‌లో కొనసాగే విధానం ఇకపై పనిచేయదని తెలిపారు.

మారుతున్న కాలంలో అసలైన ముప్పు టెక్నాలజీ కాదని, నేర్చుకోవడానికి నిరాకరించడమేనని చందోక్ హెచ్చరించారు. "ఈ కొత్త ఏఐ యుగంలో నిజమైన పింక్ స్లిప్ ఆటోమేషన్ కాదు, నేర్చుకోవడానికి నిరాకరించడమే" అని ఆయన అన్నారు. ప్రతిరోజూ అప్రస్తుతం కాకుండా ఉండేందుకు నిరంతరం యుద్ధం చేయాల్సిన అవసరం ఉందని, నేర్చుకోవడమనేది ఆక్సిజన్ మాస్క్ లాంటిదని ఆయన పోల్చారు.

ఇదే కార్యక్రమంలో మాట్లాడిన మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల, ఏఐ యుగంలో డేటా అత్యంత కీలకమైన ఆస్తి అని అన్నారు. భారత్‌లో మైక్రోసాఫ్ట్ ఏఐ సాధనాలు విజయవంతంగా పనిచేస్తున్నాయని తెలిపారు. మహారాష్ట్రలో సైబర్ భద్రత కోసం ప్రవేశపెట్టిన టూల్స్ వల్ల నాగ్‌పూర్‌లో సైబర్ నేరాల దర్యాప్తు సమయం 80 శాతం తగ్గిందని ఉదహరించారు. అదానీ సిమెంట్, యస్ బ్యాంక్, ఆదిత్య బిర్లా గ్రూప్ వంటి సంస్థలతో కలిసి ఏఐ ప్రాజెక్టులు చేపడుతున్నట్లు వివరించారు.

ఏఐ యుగంలో రాణించాలంటే నిరంతర అభ్యసనం, నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం తప్పనిసరి అని నిపుణులు సూచిస్తున్న వేళ, చందోక్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## ఎస్‌బీఐ కీలక నిర్ణయం..

**తగ్గిన గృహ, వాహన రుణాల వడ్డీ రేట్లు**

**వివిధ రుణాలపై వడ్డీ రేట్లను తగ్గించిన ఎస్‌బీఐ**

**గృహ, వాహన, ఎంఎస్‌ఎంఈ రుణాలపై తగ్గనున్న భారం**

**ఎంపిక చేసిన టర్మ్ డిపాజిట్లపై కూడా వడ్డీ రేట్ల కోత**

**ఈ నెల 15 నుంచి అమల్లోకి రానున్న కొత్త రేట్లు**




**న్యూఢిల్లీ:** దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తన వినియోగదారులకు ఊరట కల్పించే నిర్ణయం తీసుకుంది. పలు కీలక రుణ రేట్లతో పాటు ఎంపిక చేసిన టర్మ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను స్వల్పంగా తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఈ కొత్త రేట్లు ఈ నెల 15 నుంచి అమల్లోకి రానున్నాయి.

ఈ నిర్ణయంతో గృహ, వాహన, ఎంఎస్‌ఎంఈ రుణాల ఈఎంఐల భారం తగ్గనుంది. అన్ని కాలపరిమితులపై మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేటు (ఎంసీఎల్ఆర్)ను 5 బేసిస్ పాయింట్ల మేర ఎస్‌బీఐ తగ్గించింది. దీంతో ఏడాది కాలపరిమితి గల ఎంసీఎల్ఆర్ 8.70 శాతానికి చేరింది. అలాగే ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లెండింగ్ రేటు (ఈబీఎల్ఆర్)ను 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 7.90 శాతంగా నిర్ణయించింది. పాత రుణ గ్రహీతలకు వర్తించే బేస్ రేటును కూడా 10.00 శాతం నుంచి 9.90 శాతానికి తగ్గించింది.

మరోవైపు రూ.3 కోట్ల లోపు రిటైల్ టర్మ్ డిపాజిట్లపై కూడా వడ్డీ రేట్లను సవరించింది. 2 నుంచి 3 ఏళ్లలోపు డిపాజిట్లపై వడ్డీని 6.45 శాతం నుంచి 6.40 శాతానికి తగ్గించింది. సీనియర్ సిటిజన్లకు ఇదే కాలపరిమితిపై వడ్డీ రేటు 6.95 శాతం నుంచి 6.90 శాతానికి తగ్గింది. ప్రజాదరణ పొందిన 'అమృత్ వృష్టి' 444-రోజుల డిపాజిట్ పథకంపై వడ్డీ రేటును 6.60 శాతం నుంచి 6.45 శాతానికి తగ్గించింది.

ప్రభుత్వ రంగ బ్యాంకుల ఆర్థిక పనితీరు మెరుగుపడటంతో 2022-23 ఆర్థిక సంవత్సరం నుంచి వాటికి ప్రభుత్వం ఎలాంటి మూలధనం అందించలేదని ఇటీవలే కేంద్రం వెల్లడించిన విషయం తెలిసిందే.

## బేబీ పౌడర్‌తో క్యాన్సర్.. జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీకి భారీ జరిమానా

**బేబీ పౌడర్ వాడకంతో ఇద్దరు మహిళలకు క్యాన్సర్**

**క్యాన్సర్ రిస్క్ గురించి హెచ్చరించలేదన్న న్యాయస్థానం**

**జాన్సన్ అండ్ జాన్సన్‌కు రూ.330 కోట్ల జరిమానా**

**కాలిఫోర్నియా జ్యూరీ సంచలన తీర్పు**




**న్యూఢిల్లీ:** ప్రముఖ ఫార్మా దిగ్గజం జాన్సన్ అండ్ జాన్సన్‌కు అమెరికా కోర్టులో మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ సంస్థకు చెందిన బేబీ పౌడర్ వాడకం వల్ల తమకు ఒవేరియన్ క్యాన్సర్ వచ్చిందని ఇద్దరు మహిళలు దాఖలు చేసిన కేసులో వారికి అనుకూలంగా తీర్పు వెలువడింది. క్యాన్సర్ ముప్పు గురించి వినియోగదారులను హెచ్చరించడంలో కంపెనీ విఫలమైందని నిర్ధారించిన కాలిఫోర్నియా జ్యూరీ, బాధితులకు 40 మిలియన్ డాలర్లు (సుమారు రూ.330 కోట్లు) నష్టపరిహారంగా చెల్లించాలని ఆదేశించింది.

ఈ తీర్పు ప్రకారం ఒక బాధితురాలికి 18 మిలియన్ డాలర్లు, మరో బాధితురాలికి 22 మిలియన్ డాలర్లు పరిహారంగా అందుతాయి. దశాబ్దాలుగా తాము జాన్సన్ అండ్ జాన్సన్ బేబీ పౌడర్‌ను వాడుతున్నామని, దానిలో ఉన్న ఆరోగ్య ప్రమాదాల గురించి తమకు తెలియదని బాధితులు తమ పిటిషన్‌లో ఆరోపించారు. వారి వాదనలతో ఏకీభవించిన జ్యూరీ ఈ మేరకు తీర్పు ఇచ్చింది.

టాల్క్ ఆధారిత బేబీ పౌడర్ భద్రతకు సంబంధించి జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీ న్యాయపరమైన చిక్కులను ఎదుర్కోవడం ఇదే మొదటిసారి కాదు. గతంలో కూడా ప్రపంచవ్యాప్తంగా వేలాది కేసులు దాఖలు కాగా, పలు తీర్పులు కంపెనీకి వ్యతిరేకంగా వచ్చాయి. తాజా తీర్పుతో సంస్థకు మరోసారి చట్టపరంగా ఇబ్బందులు తప్పలేదు.

# చిన్నస్వామిలో ఐపీఎల్ మ్యాచ్‌లు..

**ఈ షరతులు వర్తిస్తాయి..!**

**బెంగళూరు:** బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం మళ్లీ ఐపీఎల్ మ్యాచ్‌లతో కళకళలాడనుంది. తొక్కిసలాట తర్వాత వెలవెలబోతున్న ఈ మైదానంలో మ్యాచ్‌ల నిర్వహణకు కర్నాటక ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఇటీవలే రాష్ట్రం నుంచి ఐపీఎల్ మ్యాచ్‌లను తరలిపోనివ్వమని చెప్పిన డిప్యూటీ సీఎం శివకుమార్ తమ సర్కార్ తరపున చేయాల్సిన ఏర్పాట్లన్నీ చేశారు. అంతేకాదు బెంగళూరు ఇమేజ్‌ను కాపాడేందుకు అవసరమైన జాగ్రత్తలు, షరతులు తప్పనిసరని ఆయన వెల్లడించారు.

జూన్ 4న తొక్కిసలాట తర్వాత చిన్నస్వామి స్టేడియంలో భద్రతా లోపాలు ఉన్నాయని ఏకసభ్య కమిషన్ తీర్పునిచ్చింది. అందుకని పోలీసులు కర్నాటక క్రికెట్ సంఘానికి ఎన్‌ఓసీ ఇవ్వడం లేదు. దాంతో.. స్వతంత్ర సభ్యుడి నుంచి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం కర్నాటక ప్రభుత్వం పావులు కదిపింది. కేఎస్‌సీఏకు అన్ని విధాలా సహకరించిన కర్నాటక సర్కార్ చిన్నస్వామికి పూర్వవైభవం తీసుకురానుంది.

'ఐపీఎల్ మ్యాచ్‌ల గురించి నిర్ణయానికి వచ్చాం. ఈసారి బెంగళూరు ఆతిథ్యమిస్తుందని నమ్మకంతో ఉన్నాం. కర్నాటక క్రికెట్ సంఘం అధికారులతో సమావేశం భద్రతా, ఇతర ఏర్పాట్లకు సంబంధించిన చర్యలపై చర్చించాలని హోం మంత్రి జి.పరమేశ్వరను కోరాం. చిన్నస్వామిలో ఐపీఎల్ మ్యాచ్‌లు జరిపి తీరుతాం. తొక్కిసలాట జరిగిందనే సాకుతో బెంగళూరు ప్రతిష్టను దెబ్బతీయాలనుకోవడం సమంజసం కాదు' అని శివకుమార్ పేర్కొన్నారు.

**కోర్టు కేసు.. ఎన్‌వోసీ..**

ఆర్సీబీ విక్టరీ పరేడ్‌లో జరిగిన తొక్కిసలాట ఘటనతో చిన్నస్వామి స్టేడియం మ్యాచ్‌లకు దూరమైంది. పదకొండు మంది మృతికి కారణమైనందున కోర్టు కేసు.. పోలీసులు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇవ్వకపోవడంతో.. ఆరు నెలలుగా ఇక్కడ ఒక్క మ్యాచ్ జరగడం లేదు. ఐపీఎల్ మ్యాచ్‌లను కూడా చిన్నస్వామి నుంచి తరలిస్తారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. చిన్నస్వామి స్టేడియం బెంగళూరుకు గర్వకారణమని చెప్పిన ఆయన.. ఎలాగైనా రాష్ట్రంలో ఐపీఎల్ మ్యాచ్‌లు నిర్వహిస్తామని అన్నారు.

'భవిష్యత్‌లో తొక్కిసలాట వంటి దురెటనలు జరగకుండా జాగ్రత్తపడుతాం. రాబోయే రోజుల్లో కర్నాటక క్రికెట్ స్టేడియం ఆధ్వర్యంలోని చిన్నస్వామిలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తాం. చిన్నస్వామి మన బెంగళూరుకు గర్వకారణం. స్టేడియంలో మ్యాచ్‌లు ఆడించేటప్పుడు భారీగా అభిమానులను అనుమతించకుండా చర్యలు తీసుకుంటాం. అంతేకాదు చిన్నస్వామికి ప్రత్యామ్నాయంగా ఒక పెద్ద స్టేడియం నిర్మిస్తాం. నిరుడు తొక్కిసలాట తర్వాత నెలకొన్న పరిస్థితులతో ఐపీఎల్ మ్యాచ్‌లను బెంగళూరు నుంచి తలరిస్తారనే వార్తలు వస్తున్నాయి. అయితే.. ఇప్పటికిప్పుడు అలాంటి నిర్ణయం తీసుకోరని అనుకుంటున్నా. చిన్నస్వామిలోనే ఐపీఎల్ ఆడిస్తాం. అందుకు అవసరమైన న్యాయపరమైన చర్యలు తీసుకుంటాం' అని శివకుమార్ తెలిపారు. డిసెంబర్ 16న అబుధాబీలో ఐపీఎల్ మినీ వేలం జరుగనుంది. అనంతరం కొన్ని రోజుల్లోనే టోర్నీ షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశముంది.





### కెప్టెన్ పని టాస్ వేయడమే కాదు
## సూర్యపై ఆకాశ్ చోప్రా ఘాటు వ్యాఖ్యలు

**పరుగులు చేయడం కూడా కెప్టెన్ బాధ్యతేనని స్పష్టీకరణ**

**సూర్యతో పాటు వైస్ కెప్టెన్ గిల్ ఫామ్ కూడా ఆందోళనకరమేనన్న చోప్రా**

**ప్రపంచకప్‌కు ముందు వీరిద్దరూ ఫామ్ అందుకోవడం అత్యవసరమని సూచన**



**న్యూఢిల్లీ:** టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఫామ్‌పై భారత మాజీ ఓపెనర్ ఆకాశ్ చోప్రా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. కెప్టెన్ పని కేవలం టాస్ వేసి, బౌలర్లను మార్చడమే కాదని, పరుగులు చేయడం కూడా అతని బాధ్యత అని చురకలంటించాడు. 2024 టీ20 ప్రపంచకప్ తర్వాత సూర్యకుమార్ పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో చోప్రా ఈ వ్యాఖ్యలు చేశాడు.

తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడుతూ, "మీరు జట్టుకు కెప్టెన్. కానీ కెప్టెన్సీ అంటే టాస్ వేయడం, వ్యూహాలు రచించడం మాత్రమే కాదు. టాప్-4లో బ్యాటింగ్ చేసేటప్పుడు పరుగులు చేయడం మీ ప్రధాన కర్తవ్యం. చాలా మ్యాచ్‌లు గడిచిపోయాయి. గత 17 ఇన్నింగ్స్‌లలో మీ సగటు 14 మాత్రమే. ఒక్క అర్ధ సెంచరీ కూడా లేదు. ఇది ఆందోళన కలిగించే విషయం" అని చోప్రా తెలిపాడు.

సూర్యకుమార్‌తో పాటు వైస్-కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఫామ్ కూడా జట్టుకు పెద్ద తలనొప్పిగా మారిందని ఆకాశ్ చోప్రా ఆందోళన వ్యక్తం చేశాడు. "కెప్టెన్, వైస్-కెప్టెన్ ఇద్దరూ పరుగులు చేయకపోతే, ప్రపంచకప్ బరిలోకి దిగేటప్పుడు ఆత్మవిశ్వాసంతో ఉండలేరు. వీరిద్దరూ రాణించడం జట్టుకు అత్యవసరం" అని అభిప్రాయపడ్డాడు.

2024 ప్రపంచకప్ తర్వాత సూర్యకుమార్ 26 ఇన్నింగ్స్‌లలో 18.73 సగటుతో 431 పరుగులు చేయగా, గిల్ 14 ఇన్నింగ్స్‌లలో 23.90 సగటుతో 263 పరుగులు మాత్రమే చేశాడు. వీరిద్దరి వైఫల్యం దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో టీ20లో జట్టు ఓటమికి కారణమైంది. 2026 ప్రపంచకప్‌కు ముందు కేవలం ఎనిమిది మ్యాచ్‌లు మాత్రమే మిగిలి ఉన్నందున, ఈ ఇద్దరు స్టార్ బ్యాటర్లు త్వరగా ఫామ్ అందుకోవాలని జట్టు యాజమాన్యం కోరుకుంటోంది.

## రెండో టీ20లో టీమిండియా ఓటమి..

**రాబిన్ ఊతప్ప కీలక వ్యాఖ్యలు**

**సూర్యకుమార్ అనుసరిస్తున్న విధానం తనకు నచ్చలేదన్న ఊతప్ప**

**భారీ లక్ష్యాన్ని ఛేదిస్తున్నప్పుడు మంచి బ్యాటర్లను బరిలోకి దించాలని వ్యాఖ్య**

**ప్రారంభంలో వికెట్లు కోల్పోయినప్పుడు నిలకడగా ఆడే ఆటగాడు అవసరమన్న ఊతప్ప**



**న్యూఢిల్లీ:** దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో టీమిండియా పరాజయం పాలైంది. ఈ మ్యాచ్‌లో బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులు చేయడం కూడా జట్టు ఓటమికి ఒక కారణమని మాజీ క్రికెటర్లు భావిస్తున్నారు. మ్యాచ్ ఓటమిపై మాజీ క్రికెటర్ రాబిన్ ఊతప్ప స్పందిస్తూ, సూర్యకుమార్ యాదవ్ అనుసరించిన విధానం తనకు నచ్చలేదని అన్నాడు. భారీ లక్ష్యాన్ని ఛేదించేటప్పుడు ఉత్తమ బ్యాటర్లను ముందుగా పంపాలని అభిప్రాయపడ్డాడు.

లోయర్ ఆర్డర్‌లో దూకుడుగా ఆడే ఆటగాడిని టాప్ ఆర్డర్‌కు ప్రమోట్ చేస్తే అతను చెలరేగి ఆడాలని ఊతప్ప పేర్కొన్నాడు. రెండో టీ20లో అక్షర్ పటేల్ అలా వచ్చి 21 బంతుల్లో 21 పరుగులు మాత్రమే చేశాడని తెలిపాడు. హిట్టింగ్‌కు ప్రయత్నించి వికెట్ కోల్పోయినా పర్వాలేదు కానీ, పరుగులు రాబట్టలేకపోయాడని అభిప్రాయపడ్డాడు. అక్షర్ పటేల్‌ను టాప్ ఆర్డర్‌లో పంపాలనే సూర్యకుమార్ యాదవ్ నిర్ణయం తనకు నచ్చలేదని స్పష్టం చేశాడు.

మొదటి లేదా రెండో ఓవర్‌లో వికెట్ కోల్పోయినప్పుడు నిలకడగా ఆడే ఆటగాడు అవసరమని ఊతప్ప అన్నాడు. ఇక్కడ ఏదో పొరపాటు జరుగుతోందని, ఇది అలవాటుగా మారకముందే టీమిండియా దీనిని సరిదిద్దుకోవాలని సూచించాడు. మొదట బ్యాటింగ్ చేసినా, లక్ష్య ఛేదనకు దిగినా మొదటి ముగ్గురు బ్యాటర్లను పదేపదే మార్చకూడదని అభిప్రాయపడ్డాడు. ఇవి కీలక స్థానాలని, సరైన సందర్భంలో మాత్రమే పించ్ హిట్టర్‌ను ఉపయోగించాలని వ్యాఖ్యానించాడు. ప్రపంచ కప్‌కు ముందు ఎక్కువ ప్రయోగాలు చేయడం జట్టుకు నష్టం చేకూరుస్తుందని హెచ్చరించాడు.

# ప్రారంభమైన మెస్సి ఇండియా టూర్..

**కోల్‌కతాలో 70 అడుగుల విగ్రహం ఆవిష్కరణ**

**భారత్‌లో అడుగుపెట్టిన ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సి**

**కోల్‌కతాలో ప్రారంభమైన 'గోట్ టూర్ ఆఫ్ ఇండియా'**

**కోల్‌కతా:** ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సి 14 ఏళ్ల సుదీర విరామం తర్వాత మరోసారి భారత్‌లో అడుగుపెట్టారు. 'గోట్ టూర్ ఆఫ్ ఇండియా'లో భాగంగా ఈ తెల్లవారుజామున కోల్‌కతాకు చేరుకున్నారు. ఆయనతో పాటు సహచర క్రీడాకారులు లూయిస్ సువారెజ్, రోడ్రిగో డిపాల్ కూడా వచ్చారు. కోల్‌కతా విమానాశ్రయంలో మెస్సికి అభిమానులు అర్జెంటీనా జెండాలతో ఘన స్వాగతం పలికారు. 'మెస్సి.. మెస్సి' అంటూ నినాదాలతో హోరెత్తించారు. అనంతరం భద్రతా కారణాల దృష్ట్యా, లేక్‌టౌన్‌లోని తన 70 అడుగుల విగ్రహాన్ని బాలీవుడ్ నటుడు షారుక్ ఖాన్‌తో కలిసి వర్చువల్‌గా ఆవిష్కరించారు. సాయంత్రం పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, బీసీసీఐ మాజీ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీతో ఆయన భేటీ కానున్నారు.

కోల్‌కతా కార్యక్రమం ముగిసిన వెంటనే మెస్సి హైదరాబాద్‌కు బయలుదేరతారు. ఇక్కడ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో జరిగే ఓ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం 'గోట్ కప్' పేరుతో ఉప్పల్ స్టేడియంలో జరిగే ఎగ్జిబిషన్ ఫుట్‌బాల్ మ్యాచ్‌లో ఆడనున్నారు. ఈ మ్యాచ్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి ఆయన ఫుట్‌బాల్ ఆడనుండటం విశేషం.





ఈ మ్యాచ్ ను వీక్షించడానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హైదరాబాద్‌కు వస్తున్నారు.

మొత్తం 72 గంటల పాటు సాగే ఈ పర్యటనలో భాగంగా మెస్సి డిసెంబర్ 14న ముంబయిలో, 15న ఢిల్లీలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. సోమవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో భేటీ అనంతరం ఆయన పర్యటన ముగియనుంది.

# ఓటీటీలోకి రాజు వెడ్స్ రాంబాయి..



టాకీస్: తెలంగాణలోని ఖమ్మం జిల్లా ఇల్లెందులో జరిగిన ఓ యదార్థ సంఘటన ఆధారంగా తెరకెక్కిన చిత్రం రాజు వెడ్స్ రాంబాయి. కొత్త డైరెక్టర్ సాయిలు కంపాటి తెరకెక్కించిన ఈ ప్రేమ కథా చిత్రంలో అఖిల్ రాజ్, తేజస్విని రావు హీరో, హీరోయిన్లుగా నటించారు. వీరిద్దరికీ ఇదే మొదటి సినిమా కావడం గమనార్హం. అయినా తమ అద్భుత నటనతో ఆడియెన్స్ తో కన్నీళ్లు పెట్టించారు. ఇక సిద్దు జొన్నలగడ్డ సోదరుడు చైతన్య జొన్నలగడ్డ విలన్ పాత్రలో బాగా భయపెట్టాడు. ఈ సినిమాలో అతని నటనే హైలెట్ అని చెప్పుకోవచ్చు. నవంబర్ 21న విడుదలైన రాజు వెడ్స్ రాంబాయి సినిమా మొదటి షో నుంచే సూపర్ హిట్ టాక్ తెచ్చుకుంది. బాక్సాఫీస్ వద్ద అంచనాలకు మించి కలెక్షన్లు రాబట్టింది చాలా తక్కువ బడ్జెట్ తో తెరకెక్కిన ఈ రూరల్ లవ్ స్టోరీ రూ.17 కోట్ల కు పైగా కలెక్షన్లు రాబట్టింది. థియేటర్లలో సూపర్ హిట్ గా నిలిచిన ఈ సినిమాను ఓటీటీలో చూడాలని చాలా మంది ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. త్వరలోనే వీరి నిరీక్షణకు తెరపడనుంది. రాజు వెడ్స్ రాంబాయి సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ ఈటీవీ విన్ సొంతం చేసుకుంది. ఈ నేపథ్యంలో డిసెంబర్ 19 నుంచి ఈ సినిమాను స్ట్రీమింగ్ కు తీసుకురానున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు సోషల్ మీడియాలో రాజు వెడ్స్ రాంబాయి ఓటీటీ స్ట్రీమింగ్ పోస్టులు దర్శనమిస్తున్నాయి. త్వరలోనే దీనిపై ఒక అధికారిక ప్రకటన వెలువడవచ్చు.డా. నాగేశ్వర్ పూజారి సమర్పణలో ఈటీవీ విన్ ఒరిజినల్స్, డోలాముఖి సబాల్టర్న్ ఫిల్మ్స్, మాన్సూన్ టేల్స్ బ్యానర్లపై వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి ఈ సినిమాను సంయుక్తంగా నిర్మించారు. వంశీ నందిపాటి, బన్నీ వాస్ఈ మూవీని డిస్ట్రిబ్యూట్ చేశారు. శివాజీ రాజా, అనిత చౌదరి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాకు సురేష్ బొబ్బిలి సంగీతం అందించారు.

# ఇండస్ట్రీలో నన్ను తొక్కేశారు



టాకీస్: తల్లి, అక్కా, వదిన ఇతర సహాయ పాత్రలతో తెలుగునాట పాపులర్ అయ్యారు నటి ప్రగతి. హీరోయిన్‌గా కెరీర్ మొదలుపెట్టిన ఆమె.. అనూహ్యంగా క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా టర్న్ అయ్యారు. అయినప్పటికీ తన ప్రతిభను నిరూపించుకుని వందలాది చిత్రాల్లో నటించారు ప్రగతి. అయితే గత కొన్నాళ్లుగా ప్రగతి సినిమాలకు దూరమై పవర్ లిఫ్టర్ అవతారం ఎత్తారు. పలు క్రీడల్లో పాల్గొని పతకాలు సాధించారు శభాష్ అనిపించుకున్నారు. 50 ఏళ్ల వయసులో మహిళ అయ్యుండి ఎంతో కష్టమైన ఈ పనిని చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. సంకల్పం, పట్టుదల ఉంటే వయసు అనేది ఒక నెంబర్ మాత్రమేనని ప్రగతి నిరూపిస్తున్నారు.పవర్ లిఫ్టింగ్‌లో ఇప్పటి వరకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగిన పోటీలలో పతకాలు సాధించిన ప్రగతి.. ఇటీవల టర్కీలో జరిగిన ఏషియన్ ఓపెన్ అండ్ మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ 2025లో నాలుగు పతకాలు కైవసం చేసుకుని సంచలనం స ృష్టించారు. దాంతో ప్రగతి పేరు చిత్ర సీమలో మారుమోగుతోంది. నెల్లూరు జిల్లాకు చెందిన ప్రగతి తన తండ్రి మరణంతో కుటుంబ పోషణ నిమిత్తం డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా కెరీర్ ప్రారంభించారు. ఆ తర్వాత మోడలింగ్‌లోకి దిగిన ప్రగతి .. ఆ తర్వాత హీరోయిన్‌గా పలు తమిళ చిత్రాల్లో నటించారు. అనంతరం క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా మారారు. కానీ అనూహ్యంగా సినిమాలకు దూరమైన ప్రగతి పవర్ లిఫ్టర్ అవతారం ఎత్తి షాకిచ్చారు. దీని వెనుక ఏం జరిగింది? సినిమాలను ఎందుకు వదిలేశారు? అన్న దానిపై ఇటీవల ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కీలక వ్యాఖ్యలు చేశారు ప్రగతి. ఈ వివరాల్లోకి వెళితే..టర్కీలో పతకాలు గెలిచాక నా మైండ్ బ్లాంక్ అయ్యింది. డిస్ట్రిక్ట్, స్టేట్, ఇంటర్ స్టేట్, నేషనల్ గేమ్స్‌లో ఆడాక.. కాంపిటీషన్‌కు వెళ్లడం రావడం అలవాటు అయిపోయింది. ఏ స్టేజ్ మీదకి వెళ్లినా అంచనాలతో వెళ్లను. టర్కీలో విజయం సాధించం, పతకాలు సాధించడం అనేది తీసుకోవడం ఇంకా కలగానే ఉంది. క్రీడలకు ఎంత ఎఫర్ట్ పెడతానో, సినిమాకు కూడా నూటికి నూరు శాతం ఇచ్చాను. ఏ పనిచేసినా 100 పర్సెంట్ ఇస్తాను. సినిమాలలో ఎక్కడో నేను ఎక్స్‌పెక్ట్ చేసిన ప్లాట్‌ఫాం నాకు దొరకలేదు. నా టాలెంట్ నేను చూపించడానికి అవకాశం రాలేదు. అలాంటి కొరత మనసులో ఎక్కడో ఒక చోట ఉంది. ఫలానా క్యారెక్టర్‌కు నన్నెందుకు పట్టించుకోలేదనే బాధ కూడా ఉంది. దానిని నెగిటివ్‌గా ఏం తీసుకోలేదు.. కానీ అది బెంగగానే అనిపించింది. అదెక్కడో మెల్లగా డిప్రెషన్‌లోకి మారుతుందోనని భయపడి ఇటు వైపు వచ్చాయి. అయితే ముందు నుంచి ఫిట్‌నెస్ పరంగా యాక్టీవ్. సినిమాలలో అవకాశాలు తగ్గిపోయాయి. వాళ్లు ఇచ్చేది నాకు నచ్చడం లేదు.. నేను అడిగింది వాళ్లు ఇవ్వడం లేదు.



## MOVIE TIME

# గూస్‌బంప్స్ మూమెంట్

టాకీస్: నటసింహం నందమూరి బాలకృష్ణ హీరోగా, బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన భారీ యాక్షన్-డివోషనల్ ఎంటర్టైనర్ 'అఖండ 2: తాండవం' . భారీ అంచనాల నడుమ థియేటర్లలోకి వచ్చిన ఈ మూవీకి మంచి స్పందన వస్తుంది. తొలి భాగం 'అఖండ' సృష్టించిన సెన్సేషన్‌కు కొనసాగింపుగా వచ్చిన ఈ సీక్వెల్‌పై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. విడుదల అనంతరం ఆ అంచనాలను నిజం చేస్తూ సినిమా మాస్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా బాలయ్య నట విశ్వరూపం, పవర్‌ఫుల్ డైలాగ్స్, రుద్ర తాండవం వంటి యాక్షన్ సన్నివేశాలు బాలయ్య అభిమానులకు గూస్‌బంప్స్ తెప్పిస్తున్నాయి. అయితే.. ఈ మూవీ శివుడి పాత్ర బాలయ్యనే డామినేట్ చేసేలా ఉంది. తాండవంలో బాలకృష?ను దర్శకుడు బోయపాటి శ్రీను మరింత ఎలివేటెడ్ క్యారెక్టర్‌లో చూపించాడు. అఘోర లుక్, ఉగ్రరూపం, హావభావాలు, పవర్ ఫుల్ యాక్షన్ సన్నివేశాల్లో బాలయ్య చూపించిన ఇన్టెన్సిటీ సినిమాకే ప్రధాన బలం అని చెప్పొచు. వాస్తవానికి బోయబాటి - బాలయ్య సినిమా అంటే.. లాజిక్ లను పక్కన బెట్టిన వారి చేసే మ్యాజిక్ చూడాల్సిందే. ఈ కాంబో ఎక్కువ మాస్ ఎలివేషన్లకు ప్రాధాన్యం ఇస్తుందనే విషయం తెలిసిందే. ఈ మూవీలో కూడా బోయపాటి తన మార్క్ టేకింగ్‌తో, బాలయ్య పాత్రను దాదాపు ఓ సూపర్ హ్యూమన్ గా క్రియేట్ చేశారనే చెప్పాలి. అందుకు తగ్గట్టుగానే బాలయ్య పాత్ర ఎనిమిది సంవత్సరాలు కఠోర తపస్సు చేసినట్టు చూపించారు. ఇదిలా ఉంటే.. 'అఖండ 2: తాండవం'లో మరో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది పరమేశ్వరుడి పాత్ర. తొలి భాగం 'అఖండ'లో శివుడి ప్రస్తావన ప్రతీకాత్మకంగా మాత్రమే ఉండగా, ఈ సీక్వెల్‌లో ఆ భావన మరింత విస్తరించింది. ఈసారి ఏకంగా కైలాసం నుంచి పరమేశ్వరుడు భూమికి దిగివచ్చే ఘట్టాన్ని చూపించడం ఆధ్యాత్మికతత్వాన్ని మరింత పెంచినట్టు అయింది. కథలో అఖండ తల్లి మరణించే సందర్‌లో వచ్చే ఈ సన్నివేశం సినిమాకే హైలైట్‌గా నిలుస్తోంది. ఈ సన్నివేశంలో కైలాసంలో ఉన్న శివుడు స్వయంగా భూమిపైకి వచ్చి అఖండ తల్లి చితికి అగ్నిసంస్కారం చేసినట్టు చూపించారు. ఈ సీన్ ను దర్శకుడు బోయపాటి అత్యంత భక్తిభావంతో, గ్రాండ్ విజువల్ తో తెరకెక్కించారు. అలాగే.. ఆ సీన్ కు తగ్గట్టుగా తమన్ అందించిన బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్, విజువల్స్ కలిసొచ్చి థియేటర్లలోని ప్రతి ప్రేక్షకుడికి గూస్ బంప్స్ వచ్చేలా చేస్తున్నాయని ప్రేక్షకులు చెబుతున్నారు. వెంటనే ఆ సీన్ ముగిసిన తర్వాత చప్పట్లతో థియేటర్లు మార్మోగుతున్నాయనే టాక్ వినిపిస్తోంది. ఈ కీలక ఘట్టంలో శివుడి పాత్రలో నటించింది బాలీవుడ్ నటుడు తరుణ్ ఖన్నా . హిందీ టెలివిజన్ ప్రేక్షకులకు శివుడిగా ఇప్పటికే సుపరిచితుడైన తరుణ్ ఖన్నా, ఈ సినిమాలోనూ అదే గంభీరతతో పరమేశ్వరుడి పాత్రలో ఒదిగిపోయారు. ఆయన తెరపై కనిపించిన ప్రతిసారి గూస్‌బంప్స్ రావడం ఖాయమని ప్రేక్షకుల అభిప్రాయం. తరుణ్ ఖన్నా 2015లో ప్రసారమైన మైథలాజికల్ సీరీస్ 'సంతోషి మా'లో తొలిసారి శివుడిగా నటించి మంచి పేరు సంపాదించారు. ఆ తర్వాత 'కర్మఫల్ దాత శని', 'పరమావతార్ శ్రీ కృష?', 'శ్రీమద్ రామాయణ', ప్రస్తుతం ప్రసారమవుతున్న 'కాల్ భైరవ రక్షక్ శక్తిపీఠ్ కే' వంటి పలు సీరియల్స్‌లోనూ శివుడి పాత్రను పోషించారు. శివుడిగా ఆయనకు ఉన్న అనుభవమే 'అఖండ 2'లో ఆ పాత్రను మరింత నమ్మకంగా చూపించేందుకు ఉపయోగపడిందని చెప్పాలి.

# 'ఉస్తాద్ భగత్ సింగ్' తొలి పాట..
# లక్ష మందితో లిరిక్ షీట్ ఆవిష్కరణ




**అభిమానుల చేతుల మీదుగా 'ఉస్తాద్ భగత్ సింగ్' తొలి పాట**

**ఒకేసారి లక్ష మందితో లిరిక్ షీట్ ఆవిష్కరణకు ప్లాన్**

**'దేఖ్లేంగే సాలా' అంటూ రాబోతున్న పవన్ కళ్యాణ్**

**శనివారం సాయంత్రం 6:30 గంటలకు పాట విడుదల**

టాకీస్: 'పవర్ స్టార్' పవన్ కళ్యాణ్ డైరెక్టర్ హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా బృందం సరికొత్త ప్రచారానికి శ్రీకారం చుట్టింది. సినిమా చరిత్రలో తొలిసారిగా, అభిమానుల చేతుల మీదుగా తొలి పాట లిరిక్ షీట్‌ను ఆవిష్కరించే కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ మేరకు లక్ష మంది అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొనేలా ప్రత్యేకంగా ఒక వెబ్‌సైట్‌ను రూపొందించింది.

'దేఖ్ లేంగే సాలా' అంటూ సాగే ఈ పాట లిరిక్ షీట్‌ను లాంచ్ చేసేందుకు అభిమానులు చిత్ర బృందం సూచించిన వెబ్‌సైట్‌లోకి వెళ్లి కొన్ని సులభమైన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. లక్ష మంది తమ ఎంట్రీలను నమోదు చేసిన వెంటనే, అదే వెబ్‌సైట్‌లో లిరిక్ షీట్ ప్రత్యక్షమవుతుంది. ఈ వినూత్న ప్రచారంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. ఈ పాటను ఈరోజు సాయంత్రం 6:30 గంటలకు అధికారికంగా విడుదల చేయనున్నారు.

ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండగా, 'దేఖ్ లేంగే సాలా' పాటకు భాస్కరభట్ల సాహిత్యం సమకూర్చారు. ఈ చిత్రంలో పవన్ కల్యాణ్ సరసన శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. 'గబ్బర్ సింగ్' తర్వాత పవన్-హరీశ్-దేవిశ్రీ కాంబోలో వస్తున్న సినిమా కావడంతో అభిమానులు భారీ అంచనాలతో ఎదురుచూస్తున్నారు.

# ఆరు దేశాలలో 'ధురంధర్' సినిమాపై నిషేధం

టాకీస్: రణ్ వీర్ సింగ్ హీరోగా నటించిన లేటెస్ట్ సినిమా ధురంధర్. యురి ఫేమ్ ఆదిత్య ధార్ తెరకెక్కించిన ఈ సినిమాలో సారా అర్జున్ కథానాయికగా నటించింది. అలాగే అక్షయ్ ఖన్నా, సంజయ్ దత్, అర్జున్ రాంపాల్, మాధవన్ తదితర స్టారాది స్టార్స్ నటించారు. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సాధించింది. ఈ చిత్రంలోని పాటలు, సన్నివేశాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. 'ధురంధర్' చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోంది. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఇప్పటికే రూ. 300 కోట్లకు పైగా కలెక్షన్లు రాబట్టింది. బాక్సాఫీస్ వద్ద రికార్డు వసూళ్లు రాబడుతున్న ఈ మూవీ గురించి ఒక షాకింగ్ న్యూస్ బయటకు వచ్చింది. ఈ సూపర్ హిట్ సినిమాపై నిషేధం విధించారు. ఒకటి కాదు, రెండు కాదు, ఆరు దేశాలు ఈ సినిమాను నిషేధించాయి. బహ్రెయిన్, కువైట్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా మరియు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాలు ఈ నిషేధాన్ని విధించాయి. స్పై థ్రిల్లర్ గా తెరకెక్కిన ధురంధర్ మూవీలో పాకిస్తాన్ కు వ్యతిరేకంగా సన్నివేశాలు ఉండడంతో ఇస్లామిక్ దేశాలు ఈ సంచలన నిర?యాన్ని తీసుకున్నాయి. గతంలో, 'స్కై ఫోర్స్', 'ఫైటర్', 'ఆర్టికల్ 370', 'టైగర్ 3' సినిమాలను కూడ ఈ దేశాలలో నిషేధించారు.



అయితే ధురంధర్ చిత్ర బృందం తమకు ఆసమస్య రాకుండా శాయశక్తులా ప్రయత్నించింది. కానీ అది సాధ్యం కాలేదు. సెన్సార్ బోర్డు ఈ సినిమా రిలీజ్ కు అంగీకరించలేదు. ఈ సినిమా డిసెంబర్ 5న విడుదలైంది. అప్పటి నుండి, ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ. 300 కోట్లు, భారతదేశంలో రూ. 200 కోట్లు వసూలు చేసింది. ఈ వారాంతంలో ఈ సినిమా మరిన్ని వసూళ్లు రాబట్టే అవకాశం ఉంది. కాగా చాలా సంవత్సరాల తర్వాత ఈ సినిమాతో రణ్‌వీర్ సింగ్ హిట్ కొట్టాడు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.